

# ప్రేమబాట

చిత్రపు హనుమంతరావ్

ఆ రోజు ఆదివారం. ఏ తారీకో గుర్తు లేదుకాని నడుస్తున్నది ఏప్రిల్ నెల. ఉదయం తొమ్మిదిన్నర గంటల సమయాన——

సినిమాకు ఆలస్యమైపోతున్నదని కంగారుపడుతూ, నన్ను త్వరగా తెమలమని మరొకసారి హెచ్చరించి పిల్లిలా అడుగులు వేస్తూ గేటుదగ్గరకు

వెళ్లి నిలబడ్డాడు అన్నయ్య. అమ్మా, నాన్నగారూ ప్రక్క గదిలో కూర్చుని కలాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. చీరా జాకెట్టూ మార్చుకుని నిలువుటద్దం దగ్గరకువచ్చి స్టూలుమీద కూర్చున్నాను. పౌడరు ముఖానికి అద్దుకుని మెత్తని గుడ్డతో తుడుచుకుని, కళ్ళకు కాటుక పెట్టుకున్నాను. నుదుటనిండుగా కుంకుమ తీర్చిదిద్దుకున్నాను పాపిడి సరిచేసుకుని, జడలో మల్లెచెండు తురుముకున్నాను. కొద్ది క్షణాలు నిలువుటద్దంలో నా ముఖారవిందాన్నీ అంగసౌష్ఠవాన్నీ తనివి దీరా చూసుకుంటూ కూర్చుండిపోయాను. నాలో అందమూ, నిండు యవ్వనమూ ఉన్నాయి! ఆ సుబ్బారావు నా వైపు త్రాగేసేలా చూశాడంటే చూడడూ మరి? నాలుగైదు రోజుల క్రితమే కొనుక్కున్న బెట్టజోళ్లు చేతోపట్టుకుని హాలుదాటబోయాను. జోళ్ళ చప్పుడైతే కాలేదు. కాని, గాజులుగలగలమన్నాయి. అమ్మకు పట్టుబడిపోయాను!

"అమ్మాయ్ రాధా...."

చిరాగ్గా జోళ్ల నేలమీద విసిరికొట్టి; అమ్మా, నాన్నగారూ కూర్చున్న గది గుమ్మం దగ్గరకువెళ్లి నిలబడ్డాను. నన్ను పరీక్షగా చూసి.

"ఎక్కడికో ప్రయాణమైనట్లుంది?" అన్నది అమ్మ.

తనకు మాత్రం తెలియదూ నేనెక్కడికో వెడుతున్నట్లు? అయితేనేం నానోటంట చెప్పించడం తనకు సరదా!

"అన్నయ్య సినిమాకు వెడదామన్నాడు"

"వాడవరమూ నువ్వుబయల్దేరడమూ బాగానే ఉంది. ఇవాళ మామయ్య వాళ్లు వస్తున్నారని నీకు తెలియంది కాదు.... వయస్సొచ్చిన పిల్లవి.... ప్రతీదీ ఎంతకని చెప్పాలే నీకు.... వాళ్ళొచ్చేసరికి నువ్వింట్లో లేకపోతే ఏం బావుంటుంది చెప్పు.... ఇప్పుడు సినిమాకు వెళ్ళకపోతే కొంపమునుగుతుందా? (టూ దండకం చదివింది అమ్మ.

"అవునమ్మా పాపా.... వాళ్ళొచ్చేసరికి నువ్వింట్లో లేకపోతే బావుండదు" అమ్మచెప్పిన దానికల్లా "ఎద్దేమంటే తెడ్డేమ"నడం నాన్నగారికి అలవాటైనా మామయ్యా వాళ్ళ విషయంలో మాత్రం అమ్మ అన్నదానికల్లా "అవునం"టారు!

"రాధా.... ఓయ్ రాధా...." గేటు దగ్గర నిలబడి అన్నయ్య చెవికోసిన మేకలా అరుస్తున్నాడు.

"వాడ్నిలాపిలు...." అన్నది అమ్మ.

సినిమాకు నేను వెళ్ళకపోతే మానే వాడుకూడా వెళ్ళకపోతే అదొక రకం తృప్తి! హుషారుగా గేటు దగ్గరకువెళ్లి అమ్మ పిలుస్తున్నదని చెప్పాను.

"మాతల్లివి కదూ.... వెళ్ళిపోయానని చెప్పేస్తావుగా .... అక్కడ కృష్ణుడు, పార్వతీ ఎదురుచూస్తుంటారు .... మరి నే వెళ్ళేదా?...."

నా సమాధానం కోసం వేచియుండక నాలుగడుగులువేసి, ఏదో మర్చిపోయినట్లు వెనక్కి వచ్చాడు అన్నయ్య.

"అన్నట్టు మీ మావయ్యా వాళ్లు వస్తారు కదూ.... వాళ్ళకు స్వాగత వచనాలే పలుకుతావో, పిండి వంటలేచేసి పెడతావో నీ యిష్టం...."

అన్నయ్య వడివడిగాఅడుగులువేస్తూ

వెళ్లిపోయాడు. కను మరుగయ్యేంత వరకూ వాడిని చూస్తూ నిలబడ్డాను. వాడికేం మగమహారాజు! ఏం చేసినా చెల్లుతుంది! ఉస్సురుమని నిట్టూర్చి హాల్లోకి వచ్చాను

"అన్నయ్యేడే రాధా...."

"వెళ్లిపోయాడే"

"చూశారా... తల్లి పిలుస్తున్నదన్న జ్ఞానమైనా లేకుండా ఎలా వెళ్లిపోయాడో మాలకాకిలా తిరిగి తిరిగి రాత్రే ఇల్లు చేరుకోవడం" అమ్మ ఉక్రోషంతో అన్నది.

"పిచ్చిదానా....వాడి కింకెంతకాలమే ఈ స్వేచ్ఛ... రాజ్యం మెళ్లో మూడు ముళ్లూ వేసేంతవరకేగా....ఆ తర్వాత ఆ పిల్ల వాడిన్ని దారిలో పెడుతుంది...." నాన్నగారి మాటలు నా చెవులకు చేదుగా ధ్వనించినాయి. హాల్లోకివచ్చి కూర్చు న్నాను. ఈ అన్నయ్య మరీనూ....ఆ జగన్నాధంగారు నాకు మామయ్యయితే తనకు మాత్రంకాదూ? ఆయన దృష్టిలో నేను పాతికేళ్ల యువకుడూ నాలుగేళ్ల క్రితం ఎమ్మెస్సీ ఫస్టు క్లాసులో ప్యాసై కాలేజీలో "లెక్చరరు" గిరీ వెలగబెడు తున్నవాడూ అయిన ప్రకాశరావు చెల్లెల్ని! మామయ్యావాళ్లూ వస్తుంటే నేను ఇంట్లో ఉండి చేసేదేమిటి? రాజ్యంగా చెలామణీ అయ్యే మామయ్య కూతురు స్వరాజ్య లక్ష్మికి హారతిచ్చి స్వాగత వచనాలు పలకాలా? అమ్మ నాదగ్గరకు వచ్చి అన్నది!

"రాధా....హల్వా చెయ్యకూడదటే క్రితంసారి వచ్చినప్పుడు నువ్వుచేసినది బాగుందని యిష్టపడితిన్నాడు మామయ్య"

"అబ్బబ్బ....తలనొప్పిగావుందే.... కాస్సేపు మాట్లాడించకు...."

"సినిమాకు వెళ్లంటే తలనొప్పి వచ్చేదేకాదు....పనిచెప్ప భయం కడుపు నెప్పో తలనొప్పో పాటంతటవే వచ్చే స్తాయి........రేపొద్దున్న పెళ్లయ్యాక ఆ మొగుడు నీతో ఎలా వేగుతాడో అర్థంకాదు...." అమ్మ సణుక్కుంటూ లోపలకు వెళ్లిపోయింది.

మేడమీద నాగదిలోకివచ్చి మంచంమీద కూలబడి మాసపత్రిక చదువుదామని లేచాను. అయితే మనస్సు మరొక దానిపై లగ్నమై ఉన్నప్పుడు దృష్టి దానిపై సారించడంవల్ల కలిగే ప్రయోజనమేమిటి? ఆ పుస్తకం బల్లమీద పడేసి వత్తిగిల పడుకుని కళ్ళు మూసు కున్నాను అనేకమైన ఆలోచనలు ఒక దానితర్వాతొకటి నా మనస్సులో మెదిలి ఒక రూపాన్ని దాల్చినాయి ...

నాన్నగారిపేరు లక్ష్మీవర ప్రసాదరావు. ఏలూర్లో 'క్రిమినల్' లాయర్ల జాబితాలో ఆయనదే అగ్రస్థానం. పెద్దవాళ్లు ఆయనకు సార్థక నామధేయము చేశారన్పిస్తుంది. ఎందువల్లనంటే విశేషంగా ఆర్జించారు; ఆర్జిస్తున్నారు.

అమ్మా, నాన్నగార్ల సంతానమల్లా నేమా, అన్నయ్యా. అన్నయ్య నాకన్న సుమారు ఆరేళ్ళు పెద్ద! నాన్నగారిదగ్గర నాకున్నపాటి చనువు వాడికి ఏనాడూ లేదు. నేనంటే నాన్నగారికి అంతులేని అభిమాన వాత్సల్యాలున్నాయి. నేను పుట్టాకే లక్ష్మీదేవి మాయింట్లో అడుగు పెట్టిందన్న నమ్మకం ఆయనకు ఉండడంవల్లనే కావచ్చు! లక్ష్మీదేవిపై

తనకున్న మక్కువకు చిహ్నంగా ముచ్చటైన రెండక్షరాల పేరు 'రాధ' ముందు 'లక్ష్మి' తగిల్చారు.

అన్నయ్యనుగురించి వ్రాసుకుంటూ పోతే ఓ గ్రంథం తయారవుతుంది. టూకీగా నాలుగు ముక్కల్లో చెప్పాలంటే మా దో తరగతి పుస్తకాల్లో రామూ–సోమూల పాఠంలో రామూకి అన్నివిధాల వారసుడు! ఆ రాముకు ఉండే సుగుణాలన్నీ వాడిలోనూ ఉన్నాయి. పోతే వాడిలో ఉన్న కొన్ని సుగుణాలు ఆ రామూలో లోపించి ఉండవచ్చు! అందువల్లనే బామ్మ బ్రతికున్నంత కాలమూ వాడిని 'బంగారు కొండ'ని మెచ్చుకునేది. అంతటితో సరిపెట్టక వాడిని వరికంకితోనూ, నన్ను జొన్నకంకితోనూ పోల్చి బోసినవ్వులు నవ్వేది! ఆవిడకు వాడిపై ఆవిధమైన అభిమానముండడం సహజం వాడు వంశదీపకుడు, పైగా భర్త పేరింటిగాడాయిరి! చిన్నతనంలో ఎప్పుడైనా వాడికీ నాకూ మాటామాటా వచ్చి 'అమ్మా చూడవే పెకాశిగాడు' అంటూ అమ్మతో ఫిర్యాదు చెయ్యబోతే ఒక్క ఉదుటున నా బుగ్గ పట్టుకుని మెలిపెడుతూ 'ఏమన్నావే.... మళ్లీ అను చూస్తా... అన్నయ్య అనలేవూ' అంటూ కసిరేది బామ్మ నాకళ్లల్లో నీళ్ళు తిరిగేవి. బామ్మ ఆ ప్రక్కకు వెళ్లగానే అమ్మ నన్ను సముదాయించేది. నాకేం తెలుసు తాతగారిపేరు ప్రకాశం రని? మడిబట్ట ముట్టుకుంటే నన్నయితే కసిరేది; చేతికి దొరికితే నాలుగు వాయించేది. వాడినయితే?.... 'వేళ మించి పోతూంటే మడిబట్ట ముట్టుకుంటే ఎలాగరా పిచ్చితండ్రి.... చూడు కడుపెలా ఏడుస్తోందో....' అంటూ రెక్క పట్టుకుని వాడిని గదిలోకి తీసుకువెళ్ళి తలుపులు దగ్గరగావేసి ఉట్లోంచి పాలకుండ దించి పెద్ద కంచుగ్లాసులో ఆ మరగగాచిన పాలు వంచి పాలల్లో మీగడంతా దాన్లోవేసి వాడికిచ్చేది! రాత్రిళ్ళు పక్కలో పడుకోబెట్టుకుని పిట్ట కథలు చెప్పేది, ఎళ్ళ వేళలా ఆవిడ మనస్సంతా వాడిపైనే ఉండేది. ఉదయం వాడు స్కూలుకి వెళ్ళబోతూంటే గేటువరకూ వెళ్లి పెరుగూ అన్నమూ సర్దిన క్యారియర్ వాడిచేతికిచ్చి సాగనంపుతూ 'నాన్నా సాయంత్రం స్కూలునుండి తిన్నంగా యింటికి వచ్చెయ్యాలా.... వేడివేడి చల్ల పుణుకులుచేసి పెడతాను' అనేది. సాయంత్రమయ్యేవరకూ ఆవిడ ఆలోచనలన్నీ వాడిపైనే. పిచ్చి నాగన్న ఎండలో వెళ్ళాడు' అనుకునేది, పావుగంటకొకసారి 'టైమెంతయ్యిందే అమ్మాయ్' అంటూ అమ్మనడిగేది. నాలుగయ్యే సరికల్లా వాడికోసం చూస్తూ గేటు దగ్గర పహరావేసేది. ఇక వాడుకూడా ఆవిడకు తగ్గమనవడే! సందుకొసనుండే 'బామ్మా' అంటూ పరిగెత్తుకుని వచ్చేవాడు! ఆ తర్వాత స్కూలు విశేషాలు వాడు చెబుతూంటే చెవులు రిక్కించుకుని వింటూ ఫలహారంచేసి పెట్టేది.

నాకూ పార్వతికీ స్కూల్లో జేరినప్పుడైన పరిచయం రోజులు గడిచేక స్నేహమై ఆ స్నేహలత దినదిన ప్రవర్ధమానమైపోయింది. పార్వతి తండ్రి పేరు రామారావుగారు. ఆయన ప్లీడరీ చేసే

వారు. మేము సెకండ్ ఫారంలో ఉండగా వసుతుంటా ఆయన నన్ను చూశారు. ఆయన భార్యా, పిల్లలకు మిగిల్చి వెళ్లిన ఆస్తి—పసరు పేటలో డాబాయిల్లు; పల్లెటూళ్లో బంగారు పండనిచ్చే నాలుగెకరాల పొలం.

పార్వతికి ఇద్దరన్నయ్యలు, ఒక తమ్ముడు. పార్వతి పెద్దన్నయ్య కృష్ణమూర్తి. అన్నయ్యా సమవయస్కులటమే కాదు; ఎస్సెల్సీవరకూ క్లాసుమేట్సు. ఆతర్వాత కృష్ణమూర్తిగారు 'సైన్సు'కి స్వస్తివాక్యం పలికి 'ఆర్ట్సు' తీసుకున్నారు. అయితేనేం వాళ్ళ స్నేహం చెక్కుచెదరలేదు.

సంవత్సరాలు తిరిగాయి. అన్నయ్య బిఎస్సీ ఫస్టుక్లాసులోనూ, కృష్ణమూర్తిగారు, బి.ఏ., సెకండ్ క్లాస్‌లోనూ ప్యాసయ్యారు. నేనూ పార్వతీ 'ఫోర్తు' ఫారంప్యాసై 'ఫిఫ్తు' ఫారంలోకివచ్చాము. అన్నయ్యకు 'ఎమ్మెస్సీ' మేధమెటిక్సులోనూ, కృష్ణమూర్తిగారికి ఎమ్మే ఎకనామిక్సులోనూ బెనారస్ యూనివర్శిటీలో సీట్లు వచ్చాయి. ఇద్దరూ వెళ్ళాలన్న నిశ్చయానికి వచ్చారు. పైవూరు వెడితే అన్నయ్యకు పలుగుర్లో మెలగడం చేత వవుతుందనుకున్నారో యేమోగాని నాన్నగారంగీకరించాడు. నాన్నగారంగీకరించినా చదువునిమిత్తం అన్నయ్య అంతదూరం వెళ్ళడం బామ్మకు యిష్టంలేదు. అన్నయ్యపై వూరువెళ్ళిపోతావని బెంగపెట్టేసుకుంది. 'బామ్మా..........చదువుకోసం వెళ్లాల్సొస్తోంది కాని మనస్సు మాత్రం నా దగ్గరే ఉంటుందే....' అన్నాడు అన్నయ్య.

పిచ్చినాన్నా. నా మనస్సు మాత్రం ఇక్కడ ఉంటుందిరా....ఆ హోటలు మెతుకులు పడకపోతే వచ్చెయ్యి.... వెధవ చదువు పోతేపోయే. 'అన్నది బామ్మ' సెలవులకు వస్తూంటాన'ని ఆవిడను సమాధానపరచి రైలెక్కాడు అన్నయ్య.

అన్నయ్య సెలవులకు వచ్చినప్పుడల్లా 'పుల్లలా అయిపోయాడే నాతండ్రి ఆ హోటలు మెతుకులు పడలేదు వాడికి....' అంటూ విలవిల్లాడిపోయేది బామ్మ. సెలవలై వెళ్ళిపోతాడనగా ఆహార విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మళ్లీ మళ్లీ చెప్పేది; డబ్బుకు చూసుకోక పళ్లూ, పాలూ తీసుకోమనేది. రాత్రి పూట టీ త్రాగి అట్టేసేపు మెలకువగా ఉండద్దనేది. ప్రయాణం రెండురోజులుందనగా పాలకోవా బిళ్ళలు మొదలైనవి డబ్బాల్లో బిగించేది; ఆవునెయ్యీ, ఊరగాయలు మొదలైనవి సీసాల్లో సిద్ధం చేసేది. ప్రయాణంలో తినడానికి అనువుగా వెళ్ళే రోజు బొబ్బట్లూ, కజ్జికాయలూచేసి పొట్లాలు కట్టేది. ఇవన్నీ ఒక బ్యాగులో సర్దిరిక్షా ఎక్కబోతూంటే 'ఒరేయ్ నానా....జాగ్రత్త సుమీ దొంగ వెధవలెవరైన పట్టుకుని దిగపోయేను' అని హెచ్చరించి వాడి చేతుల కిచ్చేది. మళ్ళకున మేదీ కనుచూపు మేరలోలేదని నిర్ధారణకు వచ్చాక, మాటలుకూడ దీసుకుని 'పాపా..........అన్నయ్యకు ఎదురు రామ్మా! అని నన్నుకోరేది వెళ్లిన నాలుగు రోజులకల్లా వాడి దగ్గర్నుండి ఉత్తరం రావల్సిందే. రాకపోతే యింట్లో వాళ్ళమీద చిరాకూ, చికాకూ ఎక్కువయి

పోయేవి. వాడు ఆవిడకు తగ్గ మనవడని చెప్పనే చెప్పాను కదః బెనారస్ చేర గానే అతిశ్రద్ధతో బామ్మకు ఉత్తరం వ్రాసేవాడు. అందిన రోజునే నా చేత సమాధానం వ్రాయించేది బామ్మ. ఆవిడ చెప్పినది వ్రాయడం సులభమైన పని కాదు. ఆ మాటే పైకి అంటే 'ఏం చదువులే....ఉత్తరం ముక్క వ్రాయలేని చదువులు' అనేది, వాడి ఉత్తరాలన్నీ పత్తుల పెట్లో దాచుకుని; తీరికగా ఉన్నప్పుడు ఆ పుత్తరాలన్నీ నన్ను చదవమనేది!

రెండేళ్లు వెనక్కు పడ్డాయి. అన్నయ్యా, కృష్ణమూర్తిగారు పరీక్షలు చక్కగా వ్రాసి యిళ్ళకు చేరుకున్నారు. నేనూ, పార్వతీ ఎస్సెల్సీ పరీక్షకు వెళ్ళాము.

మేనమామలులేరని నేనూ అన్నయ్యా: అన్నలూ తమ్ముళ్లూలేరని అమ్మా, బావ మరుదులులేరని నాన్నగారూ ఏనాడూ చింతిల్లలేదు. అయితే ఆలోటు ఎంత కాలమో నిలచిపోలేదు!

ఒకానొక రోజు మిట్టమధ్యాహ్నపు వేళ నేనూ అన్నయ్యా హాల్లో కూర్చుని క్యారమ్సు ఆడుకుంటున్న సమయాన 'శేషక్కయ్యా....' అన్న బొంగురు గొంతుక విన్పించింది. ఫెయిర్ పాయింటు కాస్తా ఫెయిలయ్యింది! చిరాగ్గా తలెత్తిచూశాను. సుమారు ఏభై య్యేళ్ళ వయస్సు....సూలకాయం.... బొద్దుమీసాలు మొద్దుముక్కు.... నోరు తెరచినా మూసినా దర్శనమిచ్చే గార కట్టిన ముందుపళ్ళు....ఖదరు లాల్చీ.... ఖద్దరు పంచె....ఒక చేతిలో కొడిగట్టిన చుట్ట....మరో చేతిలో చేతికర్ర; చేతి సంచీ....

అమ్మ హాల్లోకి వచ్చింది. అమ్మను చూస్తూనే.

"అదేమే శేషక్కయ్యా........మరీ అంత చిక్కిపోయావ్ అమ్మ....మ్మ ....మ్మ. ఏవి ఎండలేమ్మా" అంటూ కండువాతో ముఖం తుడుచుకుంటూ ఫ్యాను క్రిందకు కుర్చీజరుపుకుని కూర్చున్నాడాయన.

నేనూ, అన్నయ్యా ఒకరి మొహా లొకరం చూసుకున్నాము. అమ్మ తేరుకునే సరికి కొద్ది క్షణాలు పట్టింది.

"ఏం జగం. ఇంతకాలానికి గుర్తుకు వచ్చామన్నట్రా...."

"ఏవిటోనే శేషక్కయ్యా .... ఈ డాక్టరీవుంది చూశావూ....గర్భశత్రువు కైనా వద్దే....ఎప్పుడైనా వద్దామని బయలేరబోతానా అమ్మకో అయ్యకో, పిల్లకో పెళ్లానికో, ప్రాణం మీదకు వచ్చిందని ఏవడో ఒకడు సిద్ధం.... ప్రాణాలతో చెలగాట మాడ్డానికి మన మెప్పుడుకదా .... అసలు ఈ జాలీ. దయా అన్నవి మన రక్తాల్లోనే ఉన్నయి కదే...."

మరేమీ అనలేక 'అంతేరా' అనేసింది అమ్మ. నేనూ, అన్నయ్యా ఆయనవైపు వింతగా చూస్తున్నామని గ్రహించి 'జగం మావయ్యరా' అన్నది ఈయన హోమియోపతి వైద్యుడో, ఆయుర్వేద వైద్యుడోనన్న నిర్ధారణకు వచ్చేశాను.

"ఇవి నీకూతురుకదే శేషక్కయ్యా క్రితంసారి చూసినప్పుడు పొట్టిగా పీలగా ఉండేది. ఎంతలో పెళ్ళికెదిగింది...., నావైపు చూస్తూ అన్నాడాయన. చిరాకేసి

లోపలకు దారితీశాను.

"పెళ్ళంటే సిగ్గు ముంచుకొచ్చింది కోడలుపిల్లకు...." అంటూ ఘొళఘొళా నవ్వుతూంటే ఆయన హాస్యానికి వళ్ళు మండి వూచపుచ్చుకుని లెంపకాయ కొట్టాలనిపించింది.

"ఏరా....అల్లుడు....ఎంతలో పెద్దవాడి వయ్యావ్.... ఏంచేస్తున్నావ్...." చటుక్కున వెనుతిరిగి అన్నయ్యవైపు చూశాను. ఇబ్బందిగా ముఖం పెట్టి పళ్ళు నములున్నాడు.

"ఎమ్మెస్సీ పరీక్షలువ్రాసి వారం క్రితమే వచ్చాడు...." అన్నది అమ్మ.

"ఏరా పరీక్షలు ఎలావ్రాశావూ.... ఫస్టు క్లాసు వస్తుందా?...."

"బాగానే వ్రాశాను...." అన్నయ్య గొణిగాడు.

"నాక్కాపోతే ఎవరికి కొస్తుందిరా ఫస్టుక్లాసు...." అన్నాడాయన అన్నయ్య శక్తి సామర్థ్యాలు తనకు తెలిసినట్లు.

ఆయన కంఠ స్వరం ప్రక్కగదిలో నిద్రపోతున్న నాన్నగారికి మేలుకొలుపే పాడిందో, నిద్రకు అంతరాయమే కల్గించిందో నాకు తెలియదు: ఆవలిస్తూలేచి హాల్లోకివచ్చి ఆయన్నుచూస్తూనే ఆశ్చర్యపోయారు

"ఏమోయ్ జగం........హఠాత్తుగా వూడిపడ్డావ్...."

వాళ్ళు ముగ్గురూ కబుర్లలో పడ్డారు. అన్నయ్య ఒక మూలనక్కి కూర్చున్నాడు. జరుగుతున్నదంతా బామ్మ ఒక కంట కనిపెడుతూనే ఉంది. అమ్మలోపలకు వచ్చి కాఫీ ఫలహారాలు చెయ్యమని నాకు పురమాయించింది. ఏ ఫలహారం చెయ్యాలో తోచక బామ్మనడిగాను.

"ఇల్లాంటి బంధువులకు ఏ ఫలహారం చెయ్యాలో నాకు తెలుసునే పాపా.... పద...." అంటూ బామ్మవంట గదిలోకి దారితీయడంతో అనుసరించాను.

అర్ధసేరు నూకలో రెండే రెండు మిరపకాయల పోపూ, ఒకే ఒక చెంచా నెయ్యిలతో ఉప్మా అయ్యిందనిపించింది. నేను కాఫీకలపడానికి సిద్ధమవుతూంటే 'స్ట్రాంగ్‌గాచేసేవ్ జాగ్రత్త. రోజూ వచ్చేను....' అని హెచ్చరించింది.

ఆయన మంచి ఆకలితో ఉన్నాడేమో ఉప్మామారు వేయించుకుని తిని 'బ్రేవుమని' తేన్చాడు. నాన్నగారు మాత్రం నోట్లో పెట్టుకుని 'ఇదేమిటే పాపా....ఉప్పూకారమూ లేవు దీన్లో' అంటూ విసుగ్గా నావైపు చూశారు. ఆపుకోలేనంతగా నవ్వు రావటంతో 'ఆవకాయ తెస్తానంటూ' అంటూ లోపలకు వచ్చేశాను. 'ఏదో చిన్నపిల్ల ...' అన్నాడాయన.

ఆవకాయ వేశాక ఉప్మా అయ్యిందన్పించారు నాన్నగారు. ఆయన కాఫీ మంచినీళ్ళలా గడగడా త్రాగేడు కాని నాన్నగారు రుచి చూస్తూనే 'ఫిల్టరెక్కడ తగలడిందే శేషూ....'అంటూ అమ్మవైపు విరుచుకుపడ్డారు.

"మరేమోనండీ ....అలక్ష్యమవుతుందని గుడ్డతో వడగట్టాసండీ....'అన్నాను మెల్లిగా.

నాన్నగారు మెత్తబడి 'పోన్లే.... సాయంత్రానికి ఫిల్టరులో సిద్ధంచెయ్యి అన్నారు ఆయన అందుకున్నాడు.

వంటుంది చూశారూ బావగారూ....

ఆదొక కళ కాదంటుంటే....హస్తవాసి కావాలి కాని నేర్చుకుంటే వచ్చేదంటే మా బామ్మ వంటచేసేది....పోపు పెడుతుంటే చుట్టుప్రక్కల యిళ్లవాళ్ళు నోరూర్చుకునేవారు....జిహ్వనిచంపుకోలేక ఆవిడదగ్గరకు వచ్చి "బామ్మగారూ రాత్రికి భోజనం మీ యింట్లోనేనండీ" అంటే ఆపాటిదానికే మహాభాగ్యమా రాత్రికివంటేవిటి చెయ్యమంటావ్.... చీకటి పడేసరికల్లా వచ్చెయ్యి సుమీ.... వేడిచల్లారేను....' అనేది. ఆవ్యక్తి మొహమాటాన్ని అసింటాపెట్టి, 'వేవిళ్ళ కోరికల్లాంటివి' వెళ్ళబోసుకునేవాడు.... ఆ రుచికరమైన ఆధరవులతో తినేదానికి రెటింపు తినేవాడు కాని ఆవిడ సంతృప్తి పడక 'అదేవిటోయ్ రామచంద్రుడూ.... మరీ పక్షి తిండి తింటే ఎలాగయ్యా.... మరి కాస్త పులుసుకూర వడ్డించనీ....' అంటూ కొసరి కొసరి తినిపించేది మా రాజ్యానికి ఆవిడ పోలికవచ్చింది....అది వంటచేసిన రోజున సుష్టుగా భోజనం చేస్తాను....మా ఆవిడా చేస్తోంది వంట ముప్పయ్యేళ్ళనుండి .... ఎందుకూ .... రుచా? పచా?

"..............."

"బామ్మకు నేనంటే వల్ల మాలిన అభిమాన వాత్సల్యాలుండేవి. రాజ్యాన్ని చూస్తే మళ్ళీ ఆవిడే నా కడుపున పుట్టిందనిపిస్తుంది....ఆడపిల్ల ఎల్లకాలమూ మనింట్లో ఉంటుందా....దానికీ పదిహేను నిండాయా, ఎప్పుడో ఒకప్పుడు ఒక అయ్యచేతుల్లో పెట్టాల్సిందే కద....అది కాపురానికి వెళ్ళబోయే రోజు తల్చుకుంటేనే ఎక్కడలేని బెంగావస్తుంది బావగారూ........" ఆయన మాటలు వింటూంటే కడుపు నిండా పాలు కుడిచి చెవులు చిల్లులుపడేలా అరిచే 'గేద్దూడ' గుర్తుకు వచ్చింది!

"ఒరేయ్ నానా...."

బామ్మ పిలుపు చెవుల్లో పడ్డమే తరువాయి, ఒక్క అంగలో యింట్లోకి జారుకున్నాడు అన్నయ్య. జంతికలూ, కొవ్వా బిళ్లలూ పెట్టి, ఫిల్టరులో డికాక్షన్‌తో 'స్ట్రాంగ్' కాఫీచేసిచ్చింది బామ్మ. అది ఆరగించి, హాలువైపు తిరిగి చూడకుండా దొడ్డిదారంట బయటకు జారుకున్నాడు అన్నయ్య. మామయ్య మాటలు నాన్నగార్కి వడగళ్ళ వానలా తోచాయేమో తెలియదు కాని 'పాపా .... మావయ్యకు పక్కగదిలో పక్కవెయ్యి....' అన్నారు

పక్క సిద్ధంచెయ్యడంతో మేను వాల్చి; కొద్దిక్షణాల్లో వళ్ళుమరచి గుర్రుపెడుతూ నిద్రపోయాడు మామయ్య. సంధ్య వేళ 'అమ్మాయ్‌రాజ్యం....' అంటూనే నిద్రలేచాడు. వెంటనే ప్రయాణమవడానికి సిద్ధమయ్యాడు కాని రాత్రికి ఉండి ప్రొద్దున్న వెళ్ళవచ్చునని అమ్మా, నాన్నగారూ బలవంత పెట్టడంతో ఉండిపోయాడు. ఆ సాయంత్రం నాన్నగారు క్లబ్బుకి వెళ్ళలేదు అమ్మా, నాన్నగారూ మామయ్య ఆరుబయట కుర్చీల్లో కూర్చుని లోకాభిరామాయణం సాగించారు. పార్వతీ వాళ్ళింటికి బయలేరబోతూ మంచినీళ్ళు త్రాగటానికి భోజనాల' గదిలోకి వెళ్ళాను. 'ఇదీ నాయనా....నీ ఆగమనంలో అంతరార్థం అని బామ్మ పణుక్కుంటున్నది....ఆవిడ

మాటలు నా కర్థంకాలేదు

పార్వతి వాళ్ళింటిగేటు తెరవబోతూ ఇంటిముందున్న గులాబీమొక్కల్లో కూర్చుని కబుర్లుచెప్పుకుంటున్న అన్నయ్య పార్వతులనుచూసి వెనుదిరగబోయాను 'అదేవిటే రాధా....అలా వెళ్ళిపోతున్నా వంటూ పార్వతి పిలవడంతో అటు వెళ్ళక తప్పింది కాదు! అన్నయ్య నావైపు చిరాగ్గాచూశాడు. చీకటి పడేంత వరకూ కబుర్లతో గడచిపోయింది కుర్చీలోంచి లేచినిలబడి అన్నయ్య వైపు చూశాను. 'నువ్వెళ్ళవే....కృష్ణతోమాట్లాడాల'ని వాడనడంతో ఒంటరిగా యిల్లు చేరుకున్నాను.

రాత్రి పదిగంటలైనా అన్నయ్య యిల్లు చేరలేదు. అంతవరకూ 'భోజనానికి లేవండ'ని అమ్మ ఎన్నిసార్లు చెప్పినా 'అల్లుడొచ్చాకచేద్దాం. భోజనానికి తొందరేమిటి?' అంటూనే ఉన్నాడు మామయ్య ఆఖరికి నాన్నగారు 'ఏ సినిమాకో వెళ్ళుంటాడు....వాడికోసం మనం కాసిట్టు కూర్చోవడ మెందుకు....లేవండి బావగారూ....ఇప్పటికే ఆలశ్యమయ్యింది' అంటూ నాన్నగారు లేవడంతో మామయ్య లేచాడు. ఆపూట బామ్మేవంట చేసింది; తనే వడ్డన కుపక్రమించింది భోజనాలవుతూండగా 'ఏవయ్యా జగం....ఇంత కాలానికి గుర్తుకు వచ్చామటయ్యా' అన్నది బామ్మ. మామయ్య గొంతు పొలమారింది. దానికి కారణం కూరలో గొడ్డుకారమో, జేష్ఠ పుత్రిక స్వరాజ్య లక్ష్మి తండ్రిని తలచుకోవడంవల్లనో బామ్మ మాటల ప్రభావమో నాకు తెలియదు! అయితే మామయ్య తక్కువ తిన్నాడు! గ్లాసుడు మంచినీళ్ళు గడగడా త్రాగేసి, అమ్మా నాన్నగార్ల వల్లించిన మాటలే ఆవిడ దగ్గరా వల్లించాడు.

"మనస్సుంటే మార్గం ఉండదుటయ్యా అంటూ మామయ్యమాటలు కొట్టి పారేసింది బామ్మ.

రాత్రి పదకొండు గంటలైనా అన్నయ్య యిల్లు చేరలేదు. వాడికోసం



అంతవరకూ ఎదురుచూసి ఎదురుచూసి ఆఖరికి 'పాపా.... అన్నయ్యకు భోజనం నువ్వు వడ్డించమ్మా—'అని నాకు చెప్పి ఎన్నడూ లేదు.... ఈవేళ యిదేమిటో పదకొండు అయినా ఇక్కచేరలేదు అనుకుంటూనే పక్కమీదవత్తిగిలింది బామ్మ. అన్నయ్య యిల్లుచేరేసరి ఒంటిగంటన్నరయింది ఇంట్లో కాలుపెడుతూనే వాడు వేసిన ప్రశ్న: ఆయన వెళ్లారాలేదా?...." మునిపంటితో క్రింది పెదవిని నొక్కిపెడుతూ మామయ్య పడుకున్న గది వైపు చూపించాను ఎవరో తరుముకొస్తున్నట్లు మేడమీదకు దారితీశాడు నేను వెళ్ళి భోజనానికి లెమ్మంటే 'కృష్ణ బలవంతం చేశాడే.... వాళ్ళింట్లో భోజనంచేసి సెకండ్‌షో సినిమాకు వెళ్లాం' అన్నాడు. కృష్ణమూర్తిగారు బలవంతం చేశారా? లేక పార్వతి బలవంతం పెట్టిందా? అని ఎవరెవరు కలసి సినిమాకు వెళ్లారనికాని అడగలేదు. అడగడమెందుకు? ఆ ప్రశ్నలకు సమాధానాలు నాకు తెలియవూ?

ఆ మరునాడు ఉదయం తొలికోడి కుయ్యకుండానే 'రాధా.... తలుపేసుకో. నేను వెడుతున్నానంటూ అన్నయ్య నిద్ర లేపడంతో మెలకువవచ్చింది. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోయాడు. అన్నయ్యకు తొలికోడికూసే వేళకు ఏదో రైలు దాటిపోతుందన్నట్లు నిద్రలేచి ముఖం కడుక్కుని పంపుల చెరువువైపు షికారు వెళ్లడం అలవాటు. చలి వణుకుకెత్తించేస్తున్నా ఆ అలవాటు కొనసాగవల్సిందే, 'నిద్రపోతోంది పాపం.... లేపడమెందుకు' అయినా అనుకోకుండా నిద్రలేపెయ్యడంతో నాకు చిరాకు కలిగేది. 'కూసే గాడిద మేసే గాడిదను చెరచింద'న్నట్లు దారిలో పార్వతీ వాళ్లింటి దగ్గర ఆగి, కృష్ణమూర్తిగారిని నిద్ర లేపేసి తోడుతీసుకు వెళ్ళడం మామూలు! వాడు యింటికి తిరిగి వచ్చేసరి కాఫీ సిద్ధమయ్యేది ఏదో అన్నయ్య కదానని ఆపేక్షతో ఇవ్వబోతే 'కృష్ణా వాళ్ళింట్లో తాగివచ్చానే' అంటూనే నేను చిన్నబుచ్చుకుంటానేమోనని గ్లాసు అందుకునేవాడు. అది అయ్యేదన్పించి 'వాళ్లింట్లో చేస్తు మనింట్లో రాదేమిటే' అనేవాడు! మా యింట్లో నేను కాని అమ్మ కాని కలుపుతాము. వాళ్ళింట్లో పార్వతి కలుపుతుంది. రెండూ ఒక్కలా ఎలా వుంటాయి? పార్వతి చేదు కషాయ మిచ్చినా అమృతంగానే భావిస్తాడు. ఒకసారి జరిగిన సంఘటన గుర్తుకు వచ్చినప్పుల్లా ఆపుకోలేనంతగా నవ్వువస్తుంది.

ఒకరోజు సాయంత్రం నేనూ అన్నయ్యా పార్వతి వాళ్ళింటికి వెళ్ళి కృష్ణమూర్తిగారితో కబుర్లు చెబుతూ కూర్చున్నాము. కొంతసేపయిన తర్వాత పార్వతి నాలుగు గ్లాసులతో కాఫీ 'ట్రే'లో పెట్టుకునివచ్చి, మాకు ముగ్గురికీ ఇచ్చి తనొక గ్లాసు తీసుకుని కుర్చీలో కూర్చున్నది. కృష్ణమూర్తిగారు ఏదో అడుగుతూంటే సమాధానం చెబుతున్నాను. పార్వతి మా సంభాషణ ఆలకిస్తున్నది. అన్నయ్య కాఫీత్రాగడం పూర్తిచేసి 'పార్వతీ కాఫీ చాలా బాగుంది థాంక్స్' అన్నాడు. పార్వతి పెదవులపై చిరునవ్వూ, కళ్ళల్లో సిగ్గూ, చెక్కిళ్ళపై అరుణవర్ణమూ చిందులాడినాయి కృష్ణ

(9)

మామగారు కాఫీ చిప్‌చేసి 'పార్వతీ టీలో పంచదార వెయ్యలేదే....అదే ఏంటో ప్రకాశం....కాఫీ బాగుందని వట్టి ఏకేటు ఇస్తున్నావ్....' అన్నారు గట్టిగా నవ్వేస్తూ, నేనూ నవ్వేశాను; అన్నయ్యా నవ్వేశాడు. పార్వతి సిగ్గుపడుతూ, ముసి ముసిగా నవ్వుకుంటూ పంచదార తేడా నికి లోపలకు వెళ్ళింది

మామయ్య లేచేసరికి ఆరుగంట లయ్యింది. కాఫీ త్రాగి, స్నానమూ వగైరా పూర్తిచేసుకుని, చేతిసంచీ పట్టు కుని ప్రయాణమవుతూ 'అల్లుడేడే అక్కయ్యా....' అన్నాడు. అమ్మతో 'షికారుకు వెళ్ళా'డని అమ్మ అనడంతో ఇప్పుడే వచ్చేస్తాడేమో .... వాణ్ణికూడా చూసివెడతానంటూ కూర్చోబోయాడు. ఎప్పుడు వస్తాడో చెప్పలేమండీ మావయ్యగారూ .... ఒక్కోసారి ఏ స్నేహితుడింట్లోనో భోజనంచేసి యే మధ్యాహ్నమో వస్తాడు అన్నానునేను. 'అలాగా' అంటూ వస్తానే అక్కయ్యా. వస్తానండీ బావగారూ .... వస్తానమ్మా పాపా.... అంటూ ఒక్కొక్కరిదగ్గరా సెలవుతీసుకొని వెళ్ళిపోయాడు మామయ్య.

అప్పుడే మా కుటుంబానికీ మామయ్య కుటుంబానికీ బంధుత్వాలు తిరిగి ఉద యించివాయి, రాకపోకలు ప్రారంభ మయినాయి.

అన్నయ్య ఎమ్మెస్సి ఫస్టుక్లాసు లోనూ, కృష్ణమూర్తిగారు ఎమ్మే సెకండ్ క్లాసులోనూ ప్యాసయ్యారు, వాళ్ళ పరీక్ష ఫలితాలు తెల్సిన రోజున బామ్మ ఎంతగా హడావుడి చేసిందో చెప్పవలవికాదు. వచ్చేపోయేవాళ్ళకు 'మా మనవడు ఎమ్మెస్సి ఫస్టులో ప్యాసయ్యాడని ముఖ మింత చేసుకుని చెప్పుతున్నది. అన్న య్యొక్కడేనా ఎమ్మెస్సి ప్యాసవుతాః దేశంలో ప్రతీ యేడూ ఎన్నివేలమంది ప్యాస్‌కావడంలేదు? అన్నయ్యకు ఉన్న వూరి కాలేజీలో లెక్చరరు ఉద్యోగం రావడంతో ఆవిడ సంతోషానికి అంతూ పొంతూ లేకుండా పోయింది. కృష్ణ మూర్తిగారికి కూడా అదే కాలేజీలో ఎక నామిక్సు లెక్చరరు ఉద్యోగం వచ్చింది, ఏమంటుంవే నని బామ్మ చెవిన వేశాను. ఇంగిలీషు ముక్కన్నావు. దాని అర్థ మేమిటే అన్నది. 'ఆర్థిక శాస్త్రంలో లెక్చెరరన్నమాట' అన్నాను. బామ్మ నోరింత చేసుకుని నవ్వింది హోసి నీ యిల్లు బంగారంకానూ. ఇంగిలీషులో అంటే ఏమోననుకున్నాని అడితే దాన్లో చెప్పాల్సిందేముందే వెర్రిదానా. నీకు తెలియదూ? నాకు తెలియదూ? అది ఒక చదువే? మనవాడిది లెక్కలే. తెలివితేటా ఉండాలే ఆ చదువుకు. రెండింటికీ సామిప్యం తెస్తావ్. అంటూనాకేదో తెలియ దన్నట్లుతేల్చివారేసింది; బామ్మకు నేనేం చెప్పేది. విశేష మేమిటంటే అన్నయ్య ఉద్యోగస్థుడైనా ఆవిడ కళ్ళకి పసివాడే మారిజల్ట్సు వచ్చాయి. నేనూ, పార్వతీ ప్యాసయ్యాము. పేపర్లో నెంబరు చూసు కుని ఎంతో ఉత్సాహంతో బామ్మచెవిని వేద్దామని పంగెత్తాను.

"షోకిలీ కాళ్ళకడ్డం పడి పడేవ్.... ఏవిటా పరుగు" బామ్మ మందలించింది.

"పరీక్ష ప్యాసయ్యాను బామ్మా...."

"పిచ్చి పిల్లా, దానికే ఆపంతోషం.

రేపొద్దున్న మొగుడికి వండి పెట్టడానికి ఈ చదువు అక్కరకు వస్తుందటే?"

బామ్మ మాటలు విని నీరు కారి పోయాను.

ఒకరోజు పార్వతి చెప్పింది "అన్నయ్యకాలేజీలో జేర్పిస్తానన్నాడ"ని నేను కూడా కాలేజీలో జేరతానంటే అమ్మా నాన్నగారు అడ్డుచెప్పలేదు కాని బామ్మమాత్రం మన పిల్లను కాలేజీలో జేర్పిస్తావటరా, ఈడొచ్చిన పిల్లకు సంబంధంచూసి పెళ్ళిచెయ్యక నేను చూస్తూ వూరుకోనేంలేదు. కాకినాడలో ఏదో సంబంధం ఉందని పేరిశాస్త్రిల్లు చెప్పాడు అదేదో కనుక్కో" అంటూ నాన్నగారిని కేకలేసింది. నాన్నగారికి బామ్మంటే భక్తిమాట ఎలాఉన్నా భయం ఉందా మరి! ఆవిడకు ఎదురు చెప్పలేక పాపాయ్ పోనీ హిందీ పరీక్షకు కట్టమ్మా అన్నారు. నాకు భోరున ఏడవా లన్పించింది. ఇలాంటి సమయాన అన్నయ్య ఆపద్బాంధవుడిలా ఆదుకు న్నాడు. రాధా బెంగపడకే కాలేజీలో జేరుదువుగాని బామ్మను నేను ఒప్పిస్తాగా అంటూ భరోసాఇచ్చి కార్యసిద్ధికి కంకణం కట్టుకున్నాడు.

ఆ మరునాడు మధ్యాహ్నపువేళ బామ్మ భగవద్గీత చదువుకుంటున్న సమయాన దగ్గర చేరాడు అన్నయ్య. బామ్మ వాడివైపు చూసింది ప్రశ్నార్థకంగా.

"బామ్మా.... నేను పనిచేసే కాలేజీలో రాధనికూడా జేర్పిద్దామే – నాతోకూడా తీసుకెళ్ళి, తీసుకొస్తూంటానే...." గోముగా అన్నాడు.

బామ్మచేతిలో బగవద్గీత నేలజారింది. షాక్ తిన్నట్లు వాడివైపు చూస్తూ.

"ఆడపిల్లకు కాలేజీచదు వెందుకురా నాన్నా.... మతికాని పోలేదుకదా ?...." అన్నది.

"మరేమోనే బామ్మా.... ఈకాలంలో ఆడపిల్లలకు కాలేజీచదువు లేకపోతే పెళ్ళవడం మహాకష్టమే...."

బామ్మ కళ్ళింతవి చేసుకుని వాడి వైపు చూస్తూ అన్నది.

"నేను చదువుకున్నానట్రా .... మీ అమ్మ చదువుకుందట్రా....మాకు పెళ్ళిళ్ల కాలేదూ ?...."

అదేవిటి బామ్మా.... బడికి వెళ్ళి చదవక పోవచ్చుగాని తెలుగులో మీకున్న పాండిత్యం వాళ్ళకేదీ?....నీతో సరిసమా నంగా రాధని భగవద్గీత చదమను చూస్తా...."

"వాళ్ళ చదువు అలాగే ఏడుస్తున్నా యిరా .... నువ్వు చెప్పింది నిజంరా నాన్నా...."

"ఈకాలంలో కుర్రాళ్ళు కాలేజీలో చదువులేదంటే పిల్లను చూచుకోడానికి కూడా రారే.... అయినా ఈకాలంలో తాతయ్యంతటి మంచివాళ్ళు, నాన్న గారిలా తల్లి తండ్రులపై భయభక్తు లున్నవాళ్ళు అరుదే...."

బామ్మ ముఖం విప్పారింది. కళ్ళ జోడు వెనక్కు తోసుకుని, ముసుగు ముందుకు లాక్కొని వాడివైపు చూస్తూ అన్నది.

"పసివాడివైనా చక్కని మాట చెప్పావురా."

"బామ్మా కాలంమారింది. దాంతో మనమూ మారాలి."

"నీకు ముందుచూపు ఉందిరానాన్నా"

"ఏదో ఆడపిల్ల పెళ్ళయ్యేంతవరకూ దానికోరికలు తీర్చడం మనవిధి. ఆ తర్వాత మొగుడిచాటు పిల్లకదా" అన్నాడు. అన్నయ్య తనేదో మహా పెద్దవాడయిపోయినట్లు పదిమంది ఆడపిల్లల తండ్రయినట్లు!

"ఆయురారోగ్య...." అంటూ వాడ్ని దీవించేసింది బామ్మ.

ఒకకప్పు స్ట్రాంగ్ కాఫీ చేసిచ్చాను.

నేనూ పార్వతి కాలేజీలో చేరాము. లెక్చరరుగాచేరి ఆట్టేకాలం కాకపోయినా ప్రకాశరావు మేష్టారు పాఠం బాగా చెబుతారనే పేరుతెచ్చుకున్నారు మీ అన్నయ్య పాఠం బాగా చెబుతారుకదే రాధా అనేది పార్వతి. నేను వచ్చేపేరాన్ని అది తెగ సిగ్గు పడిపోయేది.

రెండుమూడు నెలలు గడచిపోయినాయి. ఎన్నడూ నలతన్నది ఎరుగని బామ్మకు ఒళ్ళు నెప్పులూ, జ్వరమూ పట్టుకున్నాయి. కాలేజీలోవున్న అన్నయ్యమనస్సంతా ఆవిడపైనే ఉండేది. సాయంత్రం యిల్లు చేరుకోగానే ఆవిడ మంచం ప్రక్కన కుర్చీవేసుకునికూర్చునే వాడు. ఒకరోజు రాత్రి వాడిని భగవద్గీత చదవమన్నది. వాడు చదువుతూ కూర్చున్నాడు. రాత్రి ఎంతవరకూ చదివాడో నాకు తెలియదు. 'బామ్మా....' అంటూ వాడు గగ్గోలు పెట్టడంతో యింటిల్లిపాదికీ మెలకువ వచ్చేసింది. వెళ్ళి చూద్దుముకదా, కళ్ళు మూసుకుని బామ్మ నిశ్చింతగా నిద్రపోతున్నది! బామ్మ ముఖంలో ఎంత ప్రశాంతత ఉన్నది! బామ్మ మరి కళ్ళువిప్పదు! బామ్మ హడావుడి స్వరం మరింక వినబడదు. నాన్నగారైతే పెద్దతనం వెళ్ళిపోయింది అనుకుని సమాధానపడ్డారు. కాని! అన్నయ్యమాత్రం చాలారోజుల వరకు కోలుకోలేదు. పగలు, రాత్రి బామ్మకోసం కలవరించేవాడు. బామ్మ జీవనరంగంలోంచి నిష్క్రమించడంతో అన్నయ్యకు కుడిభుజం పోయినట్లే. అంతవరకూ ఎలాంటి కార్యాన్నైనా బామ్మద్వారా ఇట్టే సాధించగలిగేవాడు. ఎందువల్లనంటే వాడిమాటకు బామ్మ ఎదురు చెప్పలేదు; బామ్మ మాటకు ఎదురు చెప్పగల ధైర్యసాహసాలు అమ్మా, నాన్నగార్లకు లేవు! అంత వరకూ వాడి హృదయంలో చోటు చేసుకున్నది ఇద్దరంటే ఇద్దరు – ఒకరుబామ్మ ఇంకొకరు పార్వతి. బామ్మ తనువు చాలించడంతో అన్నయ్య హృదయాన్ని పార్వతి పూర్తిగా ఆక్రమించుకున్నది.

పార్వతంటే ప్రత్యేకాభిమానం చూపించేవాడు అన్నయ్య. వాడికి వచ్చిన 'కాంప్లిమెంటరీ' టెక్స్టుబుక్కులు నావరకూ వచ్చేవికావు. కాలేజీనుండి యింటికి వస్తూ దారిలో పార్వతికిచ్చి మరీ వచ్చేవాడు. 'అదేమిట్రా' అంటే 'నీకు కావాల్సినవేవో చెప్పు కొనిస్తాను. ప్రతీ చిన్న విషయానికీ పార్వతితో వంతుకుపోకు' అన్నది వాడి సమాధానం.

నేనేం చెప్పగలను? ఇంక క్లాసులో పాఠం చెబుతూ పార్వతి ముఖంలోకి చూసి దానికి అర్థమయిందని తోచాక గాని ముందుకు సాగేవాడు. అంతేకాక మధ్యమధ్య దాన్ని ప్రశ్నలడగడం. అబ్బాయిలు సరదాగా వాళ్ళిద్దరివైపు

చూస్తూ కూర్చునేవారు. అమ్మాయిలు ముసిముసి నవ్వులతో నాదగ్గరనే వారు అదేవిటోయ్ రాధా, పార్వతంటే అంత అభిమానం చూపిస్తారు మీ అన్నయ్యని నాకు అదోలా అన్పించేది. ఆ మాటే అన్నయ్యతో అంటే వాళ్ళ మొహం అనేసేవాడు. పరీక్ష పేపర్లు దిద్దడం లోనూ అంతే. దాని పేపరు దిద్ది తక్కి నవి దిద్దేవాడు కాబోలు ఫస్టుమార్కు దానికే వచ్చేది! అది రాసినదంతా నేనూ వ్రాసినా నాలుగైదు మార్కులు తక్కువే వచ్చేవి. దానికి నాలుగు మార్కులు ఎక్కువ వేశాడనికాదు, నాకు నాలుగు మార్కులు తక్కువ వేశాడనే నా ఏడుపు. ఉండబట్టలేక వాడినడిగితే ఎక్కడో స్టెప్పు వెయ్యలేదు. నాలుగు మార్కులు వెయ్యడానికి అభ్యంతరం లేదు కాని నలుగురు చెల్లెలు కదానని మార్కులెక్కువ వేస్తున్నావని అను కోరూ? అన్నది వాడి సమాధానం. సర్లే కాలేజీ పరీక్షలు నీ చేతుల్లో పనికనక ఇష్టంవచ్చినట్లు వేస్తున్నావు. యూనివ ర్సిటీ పరీక్షలు లేవూ నా శక్తిసామర్థ్యాలు నిరూపించుకోడానికంటూ నిష్ఠూరంగా మాట్లాడా నొకసారి. పార్వతికన్న లెక్కల్లో ఎక్కువ మార్కులొస్తే పార్కరు పెన్ను ప్రజంటు చేస్తానే. ఒకవేళ నీకే ఎక్కువ వస్తే? అన్నాడు. ఎవరి కెక్కువవసే వాళ్ళకే ఇద్దువుగాని అన్నాను. ఆ సంగతి నా సమక్షంలోనే పార్వతితో చెప్పాడు

మా పరీక్షలయిపోయాయి. ఆ తర్వాత కొద్దిరోజులకు మామయ్య వచ్చాడు. గడ చిన పదినెలల్లోనూ అయిదారుసార్లు వచ్చాడు. వచ్చినప్పుడల్లా మమ్మల్నందరినీ వాళ్ళఊరు రమ్మని ఆహ్వానిస్తూనే ఉన్నాడు. ఈసారి సత్యన్నారాయణ వ్రతం చేసుకుంటున్నామనీ, మేము తప్ప కూడా బయల్దేరవలసిందేననీ పట్టు పట్టాడు.

"కోర్టులు తెరిచేస్తారు బావగారూ. మీ అక్కయ్యనూ, పిల్లల్నీ తీసుకు వెళ్ళండి నేను వీలు చూసుకుని వస్తాను" అన్నారు నాన్నగారు.

"జగం మీ బావగారికి రుచులెక్కువరా. ఆ వంటమనిషిచేసిన వంట ఆయనకు నచ్చదు. మేమిద్దరం కలసివస్తాం లేరా."

"మవ్వా, పిల్లలూ రావల్సిందేనే శేషక్కయ్యా. నువ్వు మా వూరువచ్చి ఎంతకాలమయ్యిందో. నామాట కాదనకే పోనీ నాలుగురోజులుండి వచ్చేద్దువుగాని" అంటూ అమ్మవైపు జాలిగా చూశాడు.

అమ్మ మెత్తబడి సర్లే అనేసింది! మామయ్య అన్నయ్యను రమ్మంటే పరీక్ష పేపర్లు దిద్దుకోవాలని, ఆంతేకాక ప్రిన్సిపాలుగారు సెలవల్లో ఊరువిడిచి వెళ్ళదన్నారనీచెప్పి జారుకున్నాడు. నేనూ ఏదో సాకుచెప్పబోయాను.

"నువ్విక్కడ పెంగబెట్టే రాచకార్యాలులేవు పద" అన్నది అమ్మ.

తప్పనిసరిగా ఒప్పుకోవాల్సివచ్చింది అమ్మా, నేనూ మామయ్యతో బయలుదేరాము ఆ వూరు వెళ్ళిన క్షణంనుండీ మా కిద్దరకూ రాచమర్యాదలు జరిగాయి. అయితే నకుమాత్రం 'ఎప్పుడు ఏలూరు వెళ్ళిపోదామా ?' అన్పించసాగింది.

ప్రతమైన నాలుగైదు రోజులకు మేము ప్రయాణమయ్యాము.

మామయ్య పేరు వెంకట జగన్నాధ రావు అమ్మ, మామయ్యల అమ్మలు అక్కచెల్లెళ్ళు అదీ బంధుత్వం. 'ఎల్. ఎమ్. పి.' అన్పించుకోగానే 'ఎస్టేటు సర్జన్' ఉద్యోగం వచ్చిందటగాని, ప్రయివేటు ప్రాక్టీసు పెడితే ప్రజాసేవ హెచ్చుగా చెయ్యవచ్చునన్న ఆశయంతో క్రోసి రాజన్నారట! ఏవృక్షము లేనిచోట ఆముదపు వృక్షమే మహా వృక్షంగా పరిగణింపబడుతుందంటారు. సుమారు పాతికేళ్ళక్రితం తణుకు గ్రామంలో వున్న ఎల్లో.తీ వైద్యులెందరు! కొద్దికాలంలోనే ఆవూరి ప్రజకు అయనపై గురి ఏర్పడడంతో హస్తవాసి మంచిదన్న పేరూ వచ్చింది అసలు నా అనుమానం-కాస్త అనుమానంగా వున్న కేసయితే ఏ వాల్తేరో తోలేస్తాడని! ఒకవేళ ఆయన చేతుల్లో పేషెంటు 'హరీ' మన్నా వైద్యం లోపం చెయ్యలేదు....ఆయుష్షు పొయ్యి గలమా! రోజులు చెల్లిపోయాయి. అనుకుని సమాధాన పడగలరు ఆవూరి ప్రజ. మందులకోసం మరొకచోటికి వరుగెత్తక్కర్లేకుండా డిస్పెన్సరీలో ఒక భాగం మందులషాపు. వైద్యం ఆయనచేత చేయించుకుంటూ మందులు మరొక కొట్లో కొనడానికి మనమ్సు వస్తుందకదా ఎవరికయినా. తనేం చేస్తున్నా ప్రజా సౌకర్యార్థమే నంటాడు మామయ్య.

'ఫీజు'వసూలు చెయ్యడంలో మామయ్యకు అసాధారణమైన వైపుణ్య మున్నది ఆయన దృష్ట్యా ప్రజ అయిదు రకాలు - ఖామందులు, షావుకార్లు, రైతులు, ఉద్యోగస్థులు కూలీనాలీ చేసుకుని పొట్టపోసుకునేవాళ్ళు. ఆఖరి రెండు రకాలను అంతగా పట్టించుకోడు. ఉద్యోగస్థులకైతే ఒకటో తారీకున (జీతాలందే రోజు) సాయంత్రం కాంపౌండరును బిల్లుతో పంపి వసూలు చేయిస్తాడు. ఇక కూలీనాలీచేసుకునిబ్రతికేవాళ్ళకు ఖాతాలో స్థానంలేదు! ఎప్పుడిదప్పుడు 'ఇంజక్షన్' చేసినందుకు అర్థ రూపాయా, 'మిక్చర్' డోసుకి పావలా చొప్పున కాంపౌండరు చేత వసూలుచేయిస్తాడు మామయ్యకు కాంపౌండరు అప్పారావు ఒక ఆయుధం. కూలీనాలీ చేసుకునేవాళ్ళు మామయ్యను దేవుడిగానూ, అప్పారావును యమభటుడిగానూ జమకట్టడం కద్దు! 'అ బాబు దేవుడు. ఈ సచ్చినోడు యముడోలా 'దబ్బో, దబ్బో' అని పీక్కుతింటాడు' అనుకుంటారు! ఇక ఉద్యోగస్థులు జగన్నాధంగారు పెద్ద మనిషి. నోరు విప్పి దబ్బడగడు. ఈ కాంపౌండరు కాబూలీ వాడిలా పట్టుకుంటాడు' అనుకుంటారు! ఖామందులన్నా, షావుకార్లన్నా మామయ్యకు ఒక విధమైన పక్షపాతం ఉన్నది. ఏ సమయంలోనూ వాళ్ళ దగ్గర ఫీజు సంగతి ఎత్తడు! ఖామందుల పొలాల్లో ఏయే పంటలు పండించినదీ, వాళ్ళకు ఏయే తోటలున్నదీ మామయ్యకు నాలుక చివరనే ఉంటుంది. జీలకర్ర సాంబారు పండించిన వ్యక్తితో 'జీలకర్ర సాంబారు కొవాలను కుంటున్నాన'నీ మామిడితోట ఉన్న వ్యక్తితో 'శుభ్రమైన మామిడి పండుకీ ఊరగాయ కాయకీ కరువొచ్చి పడిందండీ బజార్లో' అనీ అంటాడు.

మొహమాటానికై తేనేం, మెహర్బానీ కోసమైతేనేం 'అయ్యో డాక్టరుగారూ ఎంత మాటన్నారు మీరు బజార్లో కొనడమే?' అని ఆవ్యక్తి అనడమేకాదు; ఆమరునాటికల్లా నాలుగైదు రకాల మామిడిపళ్లూ, ఊరగాయ కాయా సిద్ధం! షావుకారు దగ్గరైతే మరోలా మెలగుతాడు చుట్టముట్టించుకుని, రెండుదమ్ములు లాగి చెప్పబోయే దైలాగు లోపల రెండు మూడుసార్లు 'రిహార్సలు' వేసుకుంటాడు! ఆ తర్వాత జేబులోంచి కరుప్పతి డబ్బా బయటకు తీసి 'షావుకారుగారూ మీరు మరోలా అనుకోక నాకొక్క సహాయం చేపెట్టాలి. అంటాడు షావుకారు చెవులు రిక్కించుకుని ఆయనవైపు చూస్తాడు. ఊరగాయ సామాన్లు, చింతపండు బుట్టనగైరా లిస్టుచదివి 'మీకొట్లో సరుకు బంగారంలా ఉంటుంది'ని ఆ షావుకారును ఉబ్బేసి డబ్బియ్యబోతాడు! ఆషావుకారు డబ్బు తీసుకోవడం తనకు పరువు తక్కువనుకుంటాడో ఏమోగాని, తనెంతగానో నొచ్చుకున్నట్లు ముఖం పెట్టి 'ఎంతమాటన్నారు డాక్టరుగారూ. ఈ సుబ్బిశెట్టి మీ దగ్గర డబ్బుతీసుకోవడమే?' అంటూ సెలవు తీసుకుంటాడు! మామయ్య గుబురు మీసాల వెనుక చిరునవ్వు మెదులుంది, ఆ మరునాటి ఉదయానికల్లా ఏడాదికి సరిపడే అపరాలన్నీ మామయ్యగారిల్లు చేరుతాయి. అయితే ఆ షావుకారు అమాయకుడా? ధరలు పెంచి ఆ డబ్బు పరోక్షంగా అమాయక ప్రజ దగ్గర వసూలు చేస్తాడు! ఇంక రైతులతో మరోలా మెలగుతాడు. ఆ సమయాన మామయ్యకు నటనాశక్తి పుట్టకతోనే అబ్బిన విద్యేమోనన్పించక మానదు! ఏవోయ్ వీరన్నా, ఈ యేడు పంటలెలా ఉన్నాయ్? కందిచేనో, పెసరచేనో వేశానన్నావ్. నీ కష్టానికి తగిన ఫలితమేనా దక్కిందా? వంగతోటకు కాలవ నీరు అందుతుందా? నువ్వు అరటితోట వేసినందుకు వర్షాలు బాగానే పడ్డాయి. నిమ్మకాయ ఏమైనా దక్కిందా లేక ఎండలకి పిందిలే రాలిపోయాయా.... అంటూ మాటలు సాగదీస్తూ కొంతసేపు ఆ రైతు కష్టసుఖాలు విచారిస్తాడు. ఆ తర్వాత అతడిని పరీక్షించి ఈమందు వాడిచూడు. మొన్ననే బొంబాయినుండి వచ్చింది ఎలాంటి దగ్గయినా కట్టాల్సిందే అంటూ మందు చేతికిస్తాడు! డాక్టరుగారు తన కష్టసుఖాలు విచారించేసరికి ఆ రైతు సంతోషంతో ముఖమింత చేసుకుని గృహోన్ముఖుడవుతాడు. ఆ తర్వాత స్వయంగావచ్చి, తను పండించినవి తృణమో, పణమో సమర్పించుకుని చేతులు జోడిస్తాడు.

మామయ్యకూ, అత్తయ్యకూ సత్యనారాయణస్వామిపై భక్తి ఉందో లేదో నాకు తెలియదు. అది ఆ స్వామికే తెలియాలి! ఏడాదికి రెండుసార్లు ఆ దంపతులు పీటలపై కూర్చుని యధావిధిగా వ్రతం జరిపించవల్సిందే. అందరికీ అందుబాటులో ఉండేలా నెల మొదటి వారంలో ఆదీ పంట యిళ్లకు చేరుకునే రోజుల్లోనే జరుగుతుంది! ధన, పేద అన్న విచక్షణ లేకుండా అందరినీ సకుటుంబసమేతంగా రమ్మని ఆహ్వానిస్తాడు మామయ్య. బాగా ధనవంతులకైతే యిళ్లకువెళ్ళి వ్రతానికి రమ్మని మరీమరీ

చెబుతాడు. ఆరోజు మామయ్యగారిల్లు జనంతో కిటకిట లాడుతుంది. ప్రతమవ గానే యింటికెదురు ఖాళీస్థలంలో వేసిన పందిట్లో విందు భోజనాలు. ఆ రాత్రి అదే పందిట్లో హరికథా కాలక్షేపం. వచ్చిన వాళ్ళు ఉత్తచేతుల్తో రారుకద. కొత్తగా కొన్న పెద్ద ట్రంకుపెట్టె వచ్చి వోట్లతో, వెండి సామానుతో, బంగారు కాసులతో నిండితే మూలగది పళ్ళతో, ఫలాలతో నిండుతుంది! ప్రతానికైన ఖర్చు వాటిగ్గైదుసార్లు అంటాడు కాని వచ్చిన రాబడిసంగతిచెప్పడు మామయ్య!

మామయ్యా, అత్తయ్యల సంతాన మల్లా నలుగురాడ పిల్లలు జ్యేష్ఠపుత్రిక పేరే స్వరాజ్యలక్ష్మి. ఎండకు తాళలేక ప్రజ అల్లల్లాడిపోతున్న రోజుల్లోపుట్టిన, ఆ పిల్ల జన్మదినం నాటి వాతావరణం హఠాత్తుగా చల్లబడి పిల్లగాలులు వీచాయనీ; పుట్టుతూనే 'స్వ....స్వ....' అన్నదనీ; ఆ తర్వాత రెండు నెలలకు 'స్వరా స్వరా' అనడం మొదలు పెట్టిందనీ; ఆ మాటల్లో మహిమ కొద్దిరోజుల్లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తనకు తెలిసివచ్చిందనీ; ఆ పిల్లమీద కథలల్లి చెబుతాడు మామయ్య! ఇంట్లో ఆపిల్లను ముద్దుగా 'రాజ్యం' అంటారు. నేనూ, రాజ్యం ఇంచుమించు ఒకే వయస్సు వాళ్లం. పచ్చని మామిడి మొక్కలాపొట్టిగా లావుగా నలుపు చాయతో తండ్రి పోలికలు పుణికి పుచ్చుకున్నట్లే ఉంటుంది రాజ్యం. తండ్రి పోలికవచ్చిన ఆడపిల్లలు అదృష్టవంతులవుతారంటుంది అత్తయ్య! అత్తయ్య వయస్సు పైబడినా నాజూగ్గానే ఉంటుంది. యదృష్టంమాట దేవుడెరుగు రాజ్యానికి తల్లి పోలిక రాకూడదూ! పోనీ రూపు రేఖలు చూడ ముచ్చటగా లేక పోతే మానె గొంతుకైనా శ్రావ్యంగా ఉండకూడదూ?

నేనూ, పార్వతీ పి. యుసి ఫస్టు క్లాసులో ప్యాసయ్యాము. ప్రెజంటు గెలుచుకోవాలన్న పంతంతో చదివా నేమో లెక్కల్లో పార్వతికన్న ఎక్కువ మార్కులు వచ్చాయి. ఎన్నోకాదు, రెండేరెండు! ప్రెజంటు సంగతి అన్నయ్యకు గుర్తుచేశాను. 'ఈ ప్రకాశ రావుకు మాటతప్పటం అలవాటులేదే' అన్నాడు.

'అహా.... అలాగా'. అనుకున్నాను. ఆ సాయంత్రం పార్వతి మాయింటికి వచ్చింది, దాన్నికూడా బజారు రమ్మన్నాను. పార్కరుపెన్ను కొని నాచేతి కిస్తూ పార్వతితో మెల్లిగా అన్నాడు. నన్ను ఓడించేశావ్ పార్వతీ' పార్వతి తలెత్తి అన్నయ్యవైపు ప్రేమాను రాగాలు నిండిన కళ్ళతో చూసి తల దించుకున్నది.

నేనూ, పార్వతీ బి. ఎస్సీలో చేరాం. మరొక మూడేళ్ళు గడిచిపోయాయి ఈ మూడేళ్ళలోనూ అన్నయ్యా, పార్వతీ మరింత సన్నిహితులయ్యారు, ఒకరి నొకరు గాఢంగా ప్రేమించుకున్నారు. అన్నయ్య పార్వతీవాళ్ళింటికి వెళ్ళని రోజంటూ ఉండదు. ఒకవేళ అన్నయ్య ఏదైనా కారణంచేత వెళ్ళకపోతే పార్వతే మాయింటికివస్తుం.. పదహేను రోజులక్రితమే మా పరీక్షలు పూర్తయి నాయి చక్కగా వ్రాశాము. ఇద్దరికీ ఫస్టుక్లాసు వస్తుందన్న విశ్వాసంఉన్నది.

గత నాలుగేళ్ళుగా మామయ్యకు మాపై ఆపేక్ష, అప్యాయతా ఎక్కువవుతూనే వచ్చాయి. సత్యనారాయణ వ్రతానికి వారంరోజులు ముందుగానే మమ్మల్నందరినీ మరీమరీ రమ్మని నాన్నగారిపేర ఉత్తరం వ్రాస్తాడు. వ్రతానికి ముందురోజువరకూ చూసి మేము రాక పోతే కనేవసాడు 'రావలసిందేనంటూ' నాన్నగారి ప్రోద్భలంవల్ల నేను రెండు మూడుసార్లు వెళ్ళక తప్పిందికాదు. అన్నయ్యమట్టుకు ఏదో సాకుచెప్పి తప్పించుకుంటూనే వచ్చాడు. మేమంటే అంతులేని అభిమానవాత్సల్యాలుండటం వల్ల కాబోలు వీడ్కోలు చెప్పడానికి బస్సుస్టాండువరకూ వచ్చి, పళ్ళబుట్టలు బస్సుపైభాగంమీద పెట్టించి సెలవు తీసుకుంటాడు మామయ్య!

అమ్మా, నాన్నగార్లకుకూడా మామయ్యపై అభిమాన వాత్సల్యాలు దినదినాభివృద్ధి అవుతూనే వచ్చాయి. ఎవరినైనా తనవైపు త్రిప్పుకొనగల చాతుర్యమూ, సామర్థ్యమూ మామయ్యకు ఉన్నాయి మరి! తరచుగా మా యింటికి వచ్చి హాజరు వేయించుకోవడం అలవాటు చేసుకున్నాడు మామయ్య ఉత్త చేతుల్తోకాక పళ్ళబుట్టలతో వస్తాడు. ఇంట్లో అడుగుపెడుతూనే దగ్గరుండి స్పెషల్‌గా కట్టించాను బావగారూ. అంటూ లంకపొగాకు చుట్టలకట్ట నాన్నగారి చేతికిస్తాడు. దొంగ వేషాలు సందు చివర దుకాణంలో కొంటూండగా నేను చూశాను అంటాడు అన్నయ్య. నాన్నగారు మామయ్యముందు అమాయకులే, చుట్టకొన కొరికి, ముట్టించి దమ్ములాగి అవునోయ్ జగం వీటి కమ్మదనం ఇక్కడివాటికేదీ? అంటారు. ఆ తర్వాత అమ్మ ఆరోగ్యం ఎలా ఉంటున్నదీ విచారించడం మామూలు. డాక్టర్లకు మందుల సేంపిల్స్ వస్తూనే ఉంటాయికద. మల్టీ విటమిన్ టాబ్లెట్లో విటమిన్ బి కాంప్లెక్సో అమ్మ చేతికిస్తూ ఇది వాడవే శేషక్కయ్యా.... మరీ నీర్సంగా కన్పిస్తున్నావూ అంటాడు. అమ్మ సంతోషించడమేకాదు; నేనంటే జగానికి ఎంత ఆపేక్ష' అనుకుని మురిసిపోతుంది

ఇవి ఇలావుంచి మాటల్తో నాన్నగారి కడుపు నింపగల నైపుణ్యమూ ఉన్నది మామయ్యకు, ఒకసారి వచ్చినప్పుడు రాజ్యంపేరున ఆరువేలు బ్యాంకులో వేసానంటాడు మరొకసారి వచ్చినప్పుడు ఆ ఆరూ పదిచేస్తేనేగాని తనకు నిద్ర పట్టదంటాడు. ఇంకొకసారి వచ్చినప్పుడు మామిడితోట తక్కువలో వస్తే రాజ్యం పేరున కొన్నానంటాడు! ఆయనలా వెళ్ళగానే అమ్మతో నాన్నగారంటారు, 'జగం ప్రయోజకుడే శేషూ....'

నాన్నగారికీ, డబ్బుకీ లంకె. ఆయన ఎల్లవేళలా ఆలోచించేది తమకున్న సిరిని గురించి, తమకు రాబోయే సిరిని గురించి.

రాజ్యాన్నిగురించి నాన్నగారనుకునే మాట 'లక్ష్మిలా ఉంటుంది'. ఆయన కళ్లకు రాజ్యం లక్షణంగా, లక్ష్మీదేవిలా గోచరించడానికి కారణం ఆమె తెచ్చే సంపద రాజ్యానికి ఏం ఓరిమి, ఏం ఓర్పు.... అనుకుంటుంది అమ్మ. అమ్మ మాటలు అక్షరాలా నిజం! రాజ్యానికి తగని ఓర్పూ, ఓరిమీ ఉన్నాయన్నది

విశ్వవిద్యాలయం! మెట్రిక్ పరీక్షకు నాలుగేళ్ళపాటు మార్చి, సెప్టెంబర్లకు నాగా లేకుండా హాజరైనా ఇటు ఎగ్జామినర్లకు, అటు యూనివర్సిటీవారికి దానిపై దయ కలగలేదు. ఐతే రాజ్యం తన ఓటమిని అంగీకరించి కార్యసాధనకు నీళ్లు వదులుకున్నదా? లేదు. క్రితం సెప్టెంబరులో యూనివర్శిటీవారు తమ అపజయాన్ని అంగీకరించారేమో తెలియదు కాని అత్తెసరు మార్కులతో విజయాన్ని సాధించింది. ఆ సందర్భంలో మామయ్య ఘనమైన విందుచేశాడు. ఆ విందుకు స్వయంగావచ్చి అమ్మా, నాన్నగార్లను తీసుకువెళ్లాడు. మెట్రిక్ ప్యాసయినప్పటినుండి రాజ్యం నాకు ఉత్తరాలు వ్రాస్తున్నది. కాగితం పైభాగాన ఎడమవైపున స్వరాజ్యలక్ష్మి, మెట్రిక్ అని వ్రాసుకుంటుంది. ఉత్తరంలో వాళ్ళ లేగదూడ ఎలా గెంతులు వేస్తున్నదో తనీమధ్య ఏయే ముగ్గులు పెట్టడం నేర్చుకున్నదో వగైరా చెత్తవ్రాసి అత్తయ్యకు నా నమస్కారములు, మామయ్యగార్కి నా నమస్కారములు, బావను అడిగినట్లు చెప్పవలెను అంటూ ముగింపు వాక్యాలు వ్రాసి సంతకం చేస్తుంది. తనను అడిగినట్లు వ్రాసిందని అన్నయ్య కొకసారి చెప్పబోయాను; ముఖం కందిపోయేలా చివాట్లు పెట్టాడు.

రాజ్యం పుట్టినప్పటినుండీ ప్రకాశం మీదే అన్ని ఆశలూ పెట్టుకున్నానే అక్కయ్యా. రాజ్యం, ప్రకాశంల ఈడూ జోడూ బాగుంటుందే అక్కయ్యా. బంధుత్వాలు దగ్గరవుతాయే అక్కయ్యా. పై సంబంధాలకు పోవడం నా కిష్టంలేదె అక్కయ్యా. దాన్ని మీ యింట్లో పడేస్తే నాకు చీకూ, చింతా ఉండదే అక్కయ్యా. పెద్దమ్మాయిగారి పెళ్ళెప్పుడని ఊరిప్రజ ఆతృత పడుతున్నారు బావగారూ. కట్నం కానుకలు అంతస్థుకు తగ్గట్లు ముట్టచెప్పి పెళ్ళి ఘనంగా చెయ్యాలని ఉందండీ బావగారూ మొదలైన మాటలు అమ్మ నాన్నగార్ల దగ్గర అనువైన సందర్భాల్లో మామయ్య నోటంట వచ్చే మాటలు అవే నాన్నగారికి జుంటితేనె కన్నా రుచించే మాటలు అవే అమ్మకు అభిమాన వాత్సల్యాలకు కొలబద్దలు. అవే నా చెవులకు కృత్రిమంగా ధ్వనించే మాటలు అవే అన్నయ్య పాలిట హృదయానికి తగిలే రామ బాణాలు.

* * *

ఎంతసేపు ఆలోచించానో ఎప్పుడు నిద్రపట్టిందో నాకు తెలియదు అమ్మ వచ్చి లేపడంతో మెలకువ వచ్చింది

"పాపా....తలనొప్పి తగ్గిందా.... పొద్దున్న తాగిన కాఫీ నీళ్లు....ఒంటి గంట కావస్తోంది. పద కాస్త ఎంగిలి పడుదువుగాని....వాళ్లింకా రాలేదు...." అంటూ క్రిందకు వెళ్ళింది. అమ్మను అనుసరించాను

భోజనమయ్యిందనిపించి హాల్లోకివచ్చి రేడియో పెట్టుకు కూర్చున్నాను. అమ్మ గుమ్మానికి ఎదురుగా కుర్చీ వేసుకుని కూర్చుని మాటిమాటికీ ఆతృతగా గేటువైపు చూస్తున్నది. హడావుడిగా కుర్చీలోంచి లేచి గేటువైపు నడిచింది. నేను కుర్చీలోంచి లేచి గుమ్మం దగ్గరకువచ్చి నిలబడ్డాను. గేటు దగ్గర రిక్షాలు ఆగి వున్నాయి ఆఫీసు గదిలో కూర్చున్న

నాన్నగారుకూడా గేటు దగ్గరకు వెళ్ళారు.

"వెధవ బస్సులు....వాటిల్లో వచ్చే కంటే నడచివస్తే తొందరగా చేరచ్చు గమ్యం.బావగారూ ఎనిమిదింటికి బయలు దేరిన వాళ్ళం ఇప్పటికి చేరుకున్నాం.... దారిలో 'బ్రేక్ డౌన్'....బస్సు బాగయ్యే సరికి మూడుగంటలు పైగా పట్టింది. ఎండంతా మా పరమే అయ్యింది.... 'నీరసంగా అంటూ రిక్షాదిగాడు మామయ్య అప్పటికే అత్తయ్యా పిల్లలూ రిక్షాలుదిగారు అమ్మా, నాన్నగారూ లోపలకు దారితీయగా వాళ్ళు అను సరించారు.

భోజనాలవుతుండగా రాజ్యంపేరున బ్యాంకులో ఎకౌంట్ పదివేలూ అయి తేనేగాని నిద్రపట్టలేదంటే నమ్మండి బావగారూ అన్నాడు మామయ్య. నాన్న గారు నూటఒకటోసారి జగం ప్రయోజ కుడని అనుకుని ఉంటారు! రాజ్యం కళ్ళు అన్నయ్యకోసం నలుమూలలా వెదక సాగినాయి. పాపం వెర్రిపిల్లకు తెలి యదు అర్ధరాత్రివరకూ వాడిల్లు చేరు కోడని.

ఆ సాయంత్రం అమ్మ నాతోఅన్నది పాపా రాజ్యాన్ని పార్వతి వాళ్ళింటికి తీసుకువెళ్ళవే. కాస్సేపు కాలక్షేప మవు తుంది.

అవును వదినా. నాకు అసలేం తోచ డంలేదు. వెడదాం అన్నది రాజ్యం.

ఎందుకు తోస్తుంది? వాళ్ళ ఊళ్ళో అయితే బోలెడుపని ఉంటుంది. తెల్ల వారగట్లే ఇంటిముందు కళాపు జల్లి ముగ్గులు పెట్టడం, ఆవులకూ గేదెలకూ గడ్డిపెట్టడం. కుడితి పెట్టడం, పశువుల పాక శుభ్రం చెయ్యటం, పాలుతియ్యడం పశువులను పేర్లుపెట్టి పిలుస్తూ వాటితో మాట్లాడం. లేగదూడలతో ఆడుకోవడం పిడకలు చెయ్యడం మొదలైన పనులతో రాజ్యానికి తీరికుండదు। చెప్పనేచెప్పాను కదా శేషక్కయ్యా. అది మా బామ్మ పోలికని. ఆవిడ కూడా పశువులపై ఇంత ప్రేమా చూపించేది అంటాడు మామయ్య।

అమ్మకు భయపడి రాజ్యా ని వెంట బెట్టుకుని పార్వతి వాళ్ళింటికి బయలు దేరాను. నేను ఊహించినట్లే అన్నయ్యా పార్వతి వరండాలో కుర్చీలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్లిద్దరినీ జంటగా చూడంతో మనస్సు 'కలుక్కు' మన్నది కాబోలు రాజ్యం కళ్ళుచిట్లిం చింది. 'రండి....రండి....' అంటూ కుర్చీలోంచి లేచి చిరునవ్వు ముఖంతో మాకెదురుకచ్చి స్వాగతం చెప్పింది పార్వతి. రాజ్యాన్ని పార్వతికి పరిచయం చేశాను. పార్వతి మమ్మల్నిద్దరినీ లోప లకు తీసుకువెళ్లింది. ఈలోపుగా పార్వతి తమ్ముడు రామం నా దగ్గరకువచ్చి అన్నయ్య పిలుస్తున్నాడని చెప్పాడు. రాజ్యాన్ని తీసుకుని వచ్చినందుకు నాపై మండి పడతాడని తెలుసు. మౌనంగా వాడి దగ్గరకు వెళ్ళాను. కళ్ళెర్రజేసి నావైపుచూస్తూ అన్నాడు.

"ఏమే.... నే నిక్కడశాంతితో ఉండి పోయాననా? ఆ గ్రహాన్నిక్కడకుతీసుకు వచ్చావ్ ?"

"నేను తీసుకురాలేదు. అమ్మ తీసుకు వెళ్ళమంది."

నేను చిన్నపుచ్చుకుంటాననుకున్నాడు

కాలోలు వ్రతం సరళంగా మార్చాడు.

"ఇదికాదే రాధా నే నిక్కడ ఉంటా నని తెలుసుకద. ఆ రాజ్యాన్ని చూడా లొస్తుందని ఇంటికి రాలేదనీ నీకు తెలుసు. ఆ రాజ్యం మామయ్య కూతు రని తెలిస్తే పార్వతే మనుకుంటుంది?"

అన్నయ్య చెప్పినది నిజమే. పార్వతి అన్నయ్యను అపార్థం చేసుకోవచ్చు. వీలైనంత తొందరగా రాజ్యాన్ని తీసు కుని వెళ్లిపోతానని అన్నయ్యకు చెప్పి లోపలకు వచ్చేశాను. పార్వతి కాఫీ కలుపుతున్నది. వాళ్ళమ్మగారు రాజ్యా నికి యిల్లు చూపిస్తున్నారు. రాజ్యం కళ్లల్లో వెనుక పెరట్లో మామిడిచెట్టు దగ్గర కట్టివున్న ఆవూ, దూడా పడ్డ మేతకు వాయి గెంతులువేస్తూ అటువైపువెళ్లింది నేనూ, ఆవిడా రాజ్యాన్ని అనుసరిం చాము. రాజ్యం లేగదూడ గంగడోలు దువ్వుతూ దాని నుదుట ముద్దుపెట్టు కుంటూ అన్నది.

"పిన్నిగారూ పేరేం పెట్టారు?"

పేరు పెట్టడం దేనికో నాకూ, ఆవి డకూ కూడా అర్థం కాలేదు.

"ఎంత ముద్దొస్తోందండీ" అంటూ రాజ్యం లేగదూడ వళ్ళు నిమరడంతో, ఆ లేగదూడ పేరు అడుగుతున్నదని మా కిద్దరికీ అర్థమయ్యింది! ఆవిడ నా వైపు దోలా చూశారు.

"మా లక్ష్మికూడా ఇలాగేవుంటుంది లక్ష్మిని వదిలి ఇంతవరకూ యిల్లు కద లేను వెర్రిముండ ఎలావుందో నాకోసం బెంగపెట్టుకుందేమో. పాలు తాగుతుందో లేదో నీళ్ళు తాగుతుందో లేదో" అంటూ కళ్లనీళ్ళు పెట్టుకున్నది రాజ్యం.

"ఎంత పదినా నాలుగు రోజులేగా" అంటూ ఓదార్చేను

తన లక్ష్మిదగ్గరే ఉన్నానన్న భ్రమతో పావుగంటవరకూ ఆ లేగదూడను వద లేదు. పార్వతి పిలవడంతో పద రాజ్యం అంటూ ముందుకు కదిలాను. ఆ దూడను తిరిగితిరిగిచూస్తూ మమ్మల్ని అనుసరించింది రాజ్యం. పార్వతి మా కిద్దరకూ కాఫీ గ్లాసులు అందించి. ఒక గ్లాసు పట్టుకుని వరండాలోకి వెళ్లింది. కొద్ది క్షణాల్లో వెళ్ళిపోయారే అంటూ తిరిగివచ్చింది. దానిముఖంవెపుచూశాను దాని మనస్సు నొచ్చుకున్నదని అర్థమ య్యింది. కాస్సేపు కూర్చుని, రాజ్యాన్ని తీసుకుని బయలుదేరాను దారిమధ్యలో రాజ్యం అన్నది.

"వదినా, నీ ఫ్రెండ్సందరూఇలాంటి వాళ్ళేనా ఏమిటి? మగాళ్ళతో సిగ్గూ ఎగ్గూ లేకుండా ఆ పకపకలూ, వికవికలూ ఏమిటి? ఛీ ఛీ."

పాపం రాజ్యానికి తెలియదు ఇవే మాటలు అన్నయ్య దగ్గరంటే పీక నులి మేస్తాడని!

రెండుమూడు రోజులు గడచిపో యాయి. అన్నయ్య నల్లపూసయిపో యాడు ఉదయం తొలి కోడి కుయ్య కుండానే నిద్రలేచి, నన్ను తలుపు వేసు కోమనిచెప్పి వెళ్ళిపోతాడు. మధ్యాహ్న మెప్పుడోవచ్చి ముఖం చూపించి భోజన మయ్యిందనిపించి వెడితే తిరిగి ఇంటికి చేరుకోవడం రాత్రి పదకొండు గంట లకు! అత్తింటికి వచ్చిన కొత్తకోడలిలా రాజ్యం మహా సిగ్గు పడుతున్నది. ఆ సిగ్గులో దానిముఖం అరుణవర్ణం దాలు

స్తున్నదేమోనని చూశానుగాని అరుణ వర్ణం నా కళ్ళకు కని ంచలేదు. శరీర వర్ణంతో కలసిపో ానదేమో ఆ అరుణ వర్ణం? ఇంక అన్నయ్య ఆ పరిసరాల్లో ఉంటే చెప్పనక్కర్లేదు. మేను పులక రించడంవల్లనేమో మో కలు తిరిగిపో తుంది, పలక స్తే మాట్లాడదు. ఎత్తు ప ్ళను పెదవులతో కప్పుపుచ్చడానికి తాపత్రయపడుతుంది. అత్తయ్యమాత్రం ప్రేమగా దానివైపుచూస్తూ, ముంగు రులు సవరిస్తూ ఛలో క్తిగా అంటుంది. నా తల్లీ ఇప్పుడే మాతో సరిగ్గా మాట్లా డంలేదు కద రేపొద్దున్న లెక్చరరుగారి భార్యనయ్యాక మాతో మాట్లాడ్డానికి తీరి కుంటుందటే?

అన్నయ్య యింట్లోవున్న సమ యాల్లో రాజ్యం బావకు కాఫీ ఇచ్చిరావే. ఫలహారం ఇచ్చిరావే.' అంటూ రాజ్యా నికి పనులుపురమాయి స్తున్నది అత్తయ్య. రాజ్యం 'ఒప్పుల కుప్ప'యి, ఒకచేత ఫలహారపు పళ్ళెరంతో, ఇంకొకచేత మంచి నీళ్ల గ్లాసుతో అన్నయ్య గదిలో అడుగుపెడుతుంది. తేళ్లూ జెర్రెలూవంటి మీద పాకినట్లు పీలవుతాడేమో అక్కడ పెట్టి వెళ్ళు అంటాడు. అన్నయ్య కఠిన మైన స్వరంతో అంతవరకూ అన్నయ్య శాంతి సహనాలను కోల్పోవడ , కాని, వాడి స్వరం అంత కఠినంగా మారడం కాని నేనెరుగను.

పార్వతీ వాళ్లింటికి ఆరోజు తర్వాత నేను వెళ్ళలేదు. నేను బయల్దేరితే అమ్మ రాజ్యాన్నికూడా తీసుకు వెళ్ళమంటుందని నా భయం ఒకరోజు పార్వతి మా యింటికి వచ్చింది. ఆ సమయాన మేమం దరమూ హాల్లోకూర్చుని కబుర్లు చెప్పు కుంటున్నాము. పార్వతి నా ప్రక్కకు వచ్చి కూర్చున్నది. దాన్ని చూడ్డంతో అన్నయ్య పెదవులపై చిరునవ్వు మెది లింది, కళ్ళు కాంతివంతమయినాయి.

"రాజ్యం పెళ్ళి ఈ వేసవిలో చేసే య్యాలని ఉందండీ బావగారూ" అన్నాడు మామయ్య. అన్నయ్య తనకేమీపట్టనట్లు లేచి బయటకు వెళ్లిపోయాడు.

"మీ రెప్పుడంటే అప్పుడు మేము సిద్ధం బావగారూ వాడికి కాలేజీ సెలవ లామరి" నాన్నగారు సమాధానమిచ్చారు.

పార్వతి ముఖం దించుకున్నది దాని ముఖంలో భావాలు చదువుదామని పల కరించాను. ముఖమెత్తి నావైపుచూసింది దాని కళ్లల్లో సుళ్లుతిరుగుతున్న కన్నీటిని చూడ్డంతో నా మనస్సు నీళ్లు కారిపో యింది. దాన్ని ఆ గదిలోంచి తీసుకుని వెళ్లడం మంచిదన్పించింది.

"మొన్న నువ్విచ్చిన నవల చదివే శానే. ఇస్తాను పద" అంటూ లేచాను. పార్వతి నన్ను అనుసరించింది. మేడ మీద నా గదిలోకి వెళ్లాక తలుపులు దగ్గ రగావేసి అనునయ స్వరంతో అన్నాను.

"అన్నయ్య నీకు అన్యాయం చేసేం తటి దౌర్భల్యుడనుకున్నావా పార్వతీ?" ఏదో దానికి ధైర్యం చెప్పడానికైతే అన్నానుగాని అన్నయ్య ధైర్యసాహ సాలు నా మాత్రం తెలియవూ? సూటిగా నా కళ్లల్లోకి చూస్తూ స్థిరమైన స్వరంతో పార్వతి అడు అన్నది ఆ తర్వాత దృషిని శూన్యంలోకి మరలుస్తూ.

ముందు ముందు పరిస్థితులెలా తయా రవుతాయో ఏంచెప్పగలమే రాధా."

అన్నది నిరాశనిండిన స్వరంతో.

కొద్దిసేపయిన ర్వాత పార్వతివెళ్లి పోయింది. దానివైపుచూస్తూ గేటుదగ్గర నిలబడిపోయాను.

మరొక రెండుమూడు రోజులకు మామయ్యా వాళ్లు వెళ్లిపోయారు. రిక్షా ఎక్కుతూ తాంబూలాలు పుచ్చుకోడానికి మంచిరోజు చూసుకుని వస్తామని అత్తయ్యా. మామయ్యా ఏకకంఠంతో అమ్మా, నాన్నగార్లతోఅన్నారు. వాళ్లున్న కొద్దిరోజులూ మాయిల్లు మహాసత్రమయి పోయింది. వాళ్లు వెళ్లడంతో మాయింట్లో గాలివాన వెలసినట్లయ్యింది.

ఒకరోజు సాయంత్రం పార్వతీ వాళ్లింటికి వెళ్లాను. పార్వతిలో చాలా మార్పువచ్చినట్లు కనిపించింది. కుశల ప్రశ్నలయ్యాక లోపలికివెళ్లి కాఫీతెచ్చి ఇచ్చి ఆలోచిస్తూ కూర్చుండిపోయింది. అన్నయ్యనుగురించి ఆలోచిస్తున్నాదేమో ననిపించింది.

"ఏమిటే ఆలోచిస్తున్నావ్?"

పార్వతి ఉలిక్కిపడి నావైపుచూసి చిరునవ్వు తెచ్చిపెట్టుకున్నది.

"అబ్బే ఏం లేదే రాధా. మన పరీక్ష లయి నెల్లాల్లు కాలేదు కద. అమ్మా, పెద్దన్నయ్యా నేనేదో బరువయి పోయి నట్లు 'ఫీల'వుతున్నారు. నిన్ను ఓ అయ్య చేతుల్లోపెట్టేంతవరకూ నాకు నిద్రపట్టదే అంటాడు పెద్దన్నయ్య పెద్దవాడు మాత్రం నాకన్న ఏమంత పెద్ద చెప్పు. ఈ మధ్య చిన్నన్నయ్య వాడికి ఉత్తరం వ్రాశాడు పార్వతి పెళ్లి సంగతి ఏ చేశావంటూ ఇంటికి దూరంగావున్నా వాడికీ నా పెళ్లి బెంగపట్టుకున్నట్లుంది."

నవ్వుతూ పార్వతి కళ్లల్లోకిచూశాను.

"పెళ్లి బెంగ నీకు మాత్రం పట్టుకో లేదూ?"

పార్వతి గంభీర వదనయి నావైపు చూసి, చూపు మరల్చుకున్నది.

"నిన్న మీ అన్నయ్య మా యింటికి వచ్చినప్పుడు మాటల సందర్భంలో అన్నయ్య అన్నాడు 'పార్వతి పెళ్లి ఈ వేసవిలో చేసేద్దామనుకుంటున్నా'మని. ఆయన సమాధానం కోసం చెవులు రిక్కించుకుని తలుపు వెనక నిలబడ్డాను. కాస్సేపు మౌనంగా కూర్చుని వస్తాన్రా కృష్ణా అంటూవెళ్లిపోయారే.

పార్వతి గొంతు జీరబోయింది కొంగుతో కళ్లు తుడుచుకున్నది.

"నిన్నరాత్రి అమ్మతో అన్నాడు అన్నయ్య ప్రకాశం చేసుకుంటాడని ఆశపడ్డాను. వాడి తంతు చూస్తూంటే వాడిమీద ఆశలు పెట్టుకుని లాభంలేద నిపిస్తోంది. మనం మరో సంబంధం చూసుకోవాల్సిందేనని"

ఇంటికివచ్చి నా గదిలో కూర్చు న్నాను. పార్వతి కళ్లనీళ్లతో నిరాశతో మాట్లాడుతున్నట్లు నా కళ్లముందు మెదల సాగింది. ఆంధ్రదేశంలో పెళ్లికావియువ కలే కొదవయ్యారా? ప్రేమించి ప్రేమించి ఉత్త భయస్తుడూ, పిరికి వాడూ నాన్నగారి చేతుల్లో కీలుబొమ్మా అయిన అన్నయ్యనే ప్రేమించాలా? తన జీవితాన్నయినా నాశనం చేసుకోవడానికి వెనుకాడదు కాని, నాన్నగార్కి ఎదురు చెప్పగల ధైర్యం వాడికిలేదు! అన్నయ్యా మిద ఎక్కడలేని కోపమూ వచ్చింది.

అన్నయ్యమాత్రం పార్వతీ వాళ్లిం

టికి మామూలుగా వెడుతూనే ఉన్నాడు. కృష్ణమూర్తిగారు పార్వతికి పెళ్లి సంబంధం వెతుకుతున్నారు విశ్రాంతిని మరచి. ఒకరోజు సాయంత్రం వాళ్లింటికి వెళ్లాను. వాళ్లమ్మగారిద్వారా తెలిసింది. రాజమండ్రిలో ఎవరో వెంకట్రామయ్యగారట వాళ్లబ్బాయి పెళ్ళికున్నాడట. మరునాడు సాయత్రం పార్వతిని చూసుకోవడానికి వస్తున్నారట. నువ్వు కూడా రా రాధా చూద్దువుగాని అన్నారావిడ. ఆవిడ లోపలకు వెళ్లాక పార్వతి అన్నది. "అన్నయ్యా నా పెళ్ళికి మహ కంగారు పడిపోతున్నాడు. జీవితంలో ఏదైనా దులుకోగలను కాని నిన్ను మాత్రం కాదు పార్వతీ అంటారు మీ అన్నయ్య ఆయన మనస్సు నాకు తెలియదూ? ఆయన్ను ఎలా అపార్థం చేసుకోగలను? నాకేం చెయ్యాలో తోచడం లేదే రాధా."

అన్నయ్య సినిమా డైలాగులు వల్లించినందువల్ల పార్వతికి ఒరిగేదేమిటి? నిజ జీవితంలో అవి విని ఎవరానందించను? పార్వతిని చేపట్టగలిగితే అన్నయ్య అదృష్టవంతుడే।అది బంగారు బొమ్మ। చదువుల సరస్వతి। శాంతి సహనాలకు పుట్టినిల్లు। అన్నయ్య పెద్దతనేదో ధైర్యస్థుడిలా దాన్ని ప్రేమించడమెందుకు? ఆ అమాయకురాలిని ప్రేమలో దింపడమెందుకు? అది అన్నయ్యను విశ్వసించి, మది మూర్తిని హృదయ ఫలకంమీద చిత్రించుకున్నదే ఆఖరికి నన్ను మర్చిపో పార్వతీ నీ హృదయంలో నా రూపాన్ని చెరిపేసుకో అంటాడు కాబోలు। తన ప్రేమ నిజమైన పక్షంలో మనస్సులో ఉన్నది కుండ బద్దకొట్టినట్లు చెప్పి రాణ్యాన్ని చేసుకోనంటే నాన్నగారుమాత్రం ఏమనగలరు? మహ అంటే ఆ స్థితిలో చిల్లిగవ్వ దక్కదంటారు అంతేనా? వాడికి చదువూ ఉద్యోగమూ ఉన్నవా మరి. సంసారాన్ని పోషించుకోలేడూ? ఆ ఆస్తికి నీళ్లు వదులుకోగలడు కాని, నాన్నగారిముందు నోరు మెదపలేడు. ఆయన ఏదంటే దానికి గంగిరెద్దులా డూడూ బసవన్నా అంటే బుర్రాడించడమే వాడికి తెలుసు। నాన్నగార్కి ఎదురు చెప్పలేక వాడు రాణ్యాన్ని వివాహమాడ్డానికి సిద్ధపడితే పార్వతి పరిస్థితి ఎలా తయారవుతుందనే నా బాధ. డెబ్బయ్ అయిదేళ్లు బ్రతికి బావుండిన బామ్మ మరో నాలుగేళ్లు బ్రతికి బావుండి అన్నయ్యచేత పార్వతి మెడలో మూడు ముళ్లూ వేయించి వెళ్లకూడదూ? పోనీ బామ్మ మరో నాలుగేళ్ల పాటు బ్రతికి బావుండడం దైవ నిర్ణయానికి విరుద్ధమైన పక్షంలో నాన్నగార్కి బామ్మ కలలో ప్రత్యక్షమై అన్నయ్యా పార్వతులను దంపతులను చెయ్యమని తన కోరికగా చెప్పకూడదూ?

ఆ రోజు రాత్రి ఏమంటాడోనని పార్వతిని చూసుకోడానికి మరునాడు ఎవరో వస్తున్నారని అన్నయ్యకు చెప్పాను. వేదాంతిలా 'అన్నిటికీ భగవంతుడే ఉన్నాడే' అంటూ ఆలోచనల్లో పడిపోయాడు. గాలిలో దీపం పెట్టి దేవుడున్నాడని విశ్వసిస్తూ నోరెళ్ళబెట్టి కూర్చోడంవల్ల కలిగే ఫలితమేమిటి? పార్వతిని చూసుకోవడానికి పెళ్లివారు వస్తున్నారనిచెప్పిన నాడు అమ్మఅన్నది.

"ఆపిల్లకేమే పుత్తడి బొమ్మ. సుగుణాలరాసి.... ఆ కాబోయే వాడెవడో అదృష్టవంతుడు"

అమ్మతో ఏదో చెబుదామనుకున్నంతలో నాన్నగారు ఆవైపు వచ్చారు.

ఆ మరువాడు సాయంత్రం పార్వతీ వాళ్ళింటికి వెళ్లాము. పార్వతికి భర్త కాబోయేవాడ్ని నాకు చూడాలని ఉండదూ? పెళ్ళివారు వచ్చారు. టిఫిను కాఫీ ఫలహారాలు ముగించాక పార్వతి వచ్చి చాపమీద ముకుళించుకుని కూర్చున్నది. అతడిని పరీక్షగా చూశాను పార్వతి ప్రక్కన అన్నయ్యను ఊహించుకుని చూశానేమో అతడిలో పార్వతికి భర్త కాగల అర్హతలు నాకళ్ళకు ఆనలేదు. అయితే అతడి ముఖంలోని భావాలను బట్టి పార్వతి నచ్చిందని స్పష్టమయ్యింది దాన్లో వింతేమీలేదు. పార్వతి వాళ్ళింట్లో వాళ్ళు అతడిని గురించి అనాకారికాదు మగాడికి అందమేమిటి? అనుకుని సమాధానపడ్డారు వాళ్ళున్నంతసేపూ పార్వతి వంచిన తల ఎత్తలేదు. వాళ్ళడిగిన ప్రశ్నలకు ముక్తసరిగా సమాధానాలిచ్చిందేకాని నోరు మెదపలేదు. దాని మనస్సు నేనర్థం చేసుకోలేనూ? ఏ సంగతీ వ్రాస్తామంటూ పెద్దవాళ్ళు లేవడంతో అతడూ అయిష్టంగా లేచాడు వాళ్లు వెళ్ళిపోయారు. పార్వతీ వాళ్ళింట్లో వాళ్లకు ఈ సంబంధం తప్పకుండా కుదురుతుందన్న ఆశఉన్నా?.

ఆరాత్రి నాకు నిద్రపట్టలేదు. పార్వతి దీనవదనమే నా కళ్లముందు మెదులుతున్నది. అన్నయ్య తత్వం నాకర్థం కాలేదు. అసలు వాడు పార్వతిని ప్రేమించాడా? ప్రేమించిన పక్షంలో వాడింత నిశ్చింతగా ఉండగలడా? వరండాలోకి వచ్చినిలబడ్డాను అన్నయ్య గదిలో దీపం వెలుగుతున్నది. కిటికీదగ్గరకు వెళ్ళి నిలబడ్డాను. ఎదురుగావున్న కిటికీలో కాళ్లు పెట్టుకుని కుర్చీలో కూర్చున్నాడు అన్నయ్య వాడి చేతిలో సిగరెట్టు పొగ విడుస్తున్నది. నేలమీద ఏడెనిమిది సిగరెట్టు పీకలు పడిఉన్నాయి. చేత్తో తాకడానికే ఇష్టపడని అన్నయ్య సిగరెట్లెలా కాలవగలుగుతున్నాడు? వాడి మనస్సు వికలమైపోయిందా? ఇప్పటికే వాడిలా తయారవుతున్నాడుకద. పార్వతికి మరొకరితో పెళ్లయిపోతే తట్టుకోగలడా? పార్వతిని మర్చిపోడానికి ఏ త్రాగుడైనా అలవాటు చేసుకుంటాడా? నా హృదయం అన్నయ్యపై జాలితో నిండిపోయింది. భగవంతుడా నాన్నగారి ముందు నిలబడి మాట్లాడగల ధైర్యాన్ని అన్నయ్యకు ప్రసాదించు .... పార్వతీ, అన్నయ్యలను దంపతులనుచెయ్యి' అనుకుంటూవచ్చి మంచంమీద కూలబడ్డాను. ఒక ప్రక్క సున్నితమై సుగంధ సౌరభాలను విరజిమ్మే స్నేహలతతో నను బంధించిన పార్వతి.... వేరొక ప్రక్క అభిమాన వాత్సల్యాలను నాపై గుమ్మరిస్తూ ఎల్లవేళలా నా శ్రేయస్సును కోరే అన్నయ్య ఇద్దరూ మనోవ్యధతో కుమిలిపోతున్నారు. పార్వతి విరహోత్కంఠితగా, అన్నయ్య సినిమాలో దేవదాసులా నాకళ్ళముందు మెదలసాగారు.

పార్వతీ వాళ్ళింటికివెళ్ళి వారం రోజులయ్యింది. ఏ ముఖం పెట్టుకుని వెళ్ళేది? అన్నయ్య దినచర్య పూర్తిగా మారి

పోయింది. ఉదయం షికారుకు ఒక రోజు వెడితే నాలుగు రోజులువెళ్ళడు. వెళ్ళినా అరగంటలో తిరిగి వచ్చేస్తాడు. కాఫీ ఇస్తే తీసుకుంటాడు. లేకపోతే అడగడు. భోజనానికి పిలిస్తేవస్తాడు లేక పోతే మర్చిపోతాడు. తన గదివిడచి అంతగా బయటకు రావడంలేదు. వాటి మాటల్లో చురుకుదనం, ఉత్సాహం కరు వయ్యాయి వాడి కళ్ళల్లో విషాదం కొట్ట వచ్చినట్టు కన్పిస్తున్నది. సిగరెట్లురోజు రోజుకీ హెచ్చుగా కాలుస్తున్నాడు. ఒక సారి కృష్ణమూర్తిగారు మా యింటికి వచ్చారు 'అదేవిట్రా ప్రకాశం. ఈమధ్య మా యింటికి రావడం మానేశావ్' అంటూ. అన్నయ్య నవ్వుతెచ్చి పెట్టు కుని ఏం లేదురా.....'అన్నాడు.

ఒకరోజు మధ్యాహ్నం పార్వతీవాళ్ళ తమ్ముడువచ్చి 'మా అక్క మిమ్మల్నొక సారి రమ్మనమని చెప్పమన్నది'ని చెప్పాడు.

ఆ సాయంత్రం పార్వతీ వాళ్లింటికి వెళ్లాను. ఇంటిముందు పెరట్లో అన్నయ్య. పార్వతీ కూర్చునేజాగా దోసిగా ఉన్నది. కృష్ణమూర్తిగారు వరండాలో కుర్చీలో కూర్చుని ఉన్నారు. ఆయనకూడా అన్న య్యలాగే దిగాలుగా ఉన్నారు. నవ్వు తెచ్చుపెట్టుకుని రామ్మా రా. ఏవిటీమధ్య రావడం మానేశావ్?అంటూ పార్వతిని పిలిచారు. పార్వతి గుమ్మం దగ్గరకువచ్చి నిలబడి లోపలకు రమ్మ న్నది. నేను అనుసరించాను. తన గది లోకి వెళ్ళికూర్చున్నాక కాఫీ తెచ్చి ఇచ్చింది. ఆ తర్వాత ఒక కవరు నాచేతి కిచ్చి తలుపులు దగ్గరగా వేసింది.

ఏమిటీ? అన్నాను విస్మయంతో. పార్వతి పెదవులపై పేలవమైన చిరునవ్వు మెది లింది చూస్తే నీకే తెలుస్తుందికదే అన్నది నిర్జీవమైన స్వరంతో. ఆతర్వాత అది కిటికీ దగ్గరకువెళ్ళి నీలాకాశాన్ని చూస్తూ నిలబడ్డది. ఆ కవరుమీద పోస్టలు ముద్ర చూశాను. అది రాజ మండ్రినుండి వచ్చింది. అంటే పార్వ తిని చూసుకుని వెళ్ళినవాళ్ళదగ్గరనుండి కావచ్చు. ఏమని వ్రాశారు? పిల్ల నచ్చిం దనీ ముహూర్తం పెట్టుకుందామనీ వ్రాసేశారా? కంగారుగా కవర్లోఉన్న కాగితాలు బయటకు లాగాను దాన్లో ఉన్నవి రెండేరెండు పావుటావు సైజు కాగితాలు. ఒకటి చదువ మొదలు పెట్టాను!

కృష్ణమూర్తిగారికి,

మీ చెల్లెలు బంగారు బొమ్మేకావచ్చు అయితే ఆ బంగారు బొమ్మను ఇంటి కోడలుగా తెచ్చుకోగల సాహసం మేము చెయ్యలేము. దానికి కారణం జతపర్చిన ఉత్తరంచూస్తే మీకే తెలుస్తుంది. మీరు మరొక సంబంధం చూసుకోవచ్చును.

చిత్తగించవలెను

ఇట్లు

వెంకట్రామయ్య

ఒకప్రక్క ఆశ్చర్యమూ, వేరొక ప్రక్క పార్వతిలో లోపమేమిటన్న సంశ యమూ కలిగాయి. ఎందుకో చెప్పలేను గాని తేలిగ్గా నిట్టూర్చాను. కుతూహ లంతో రెండవ ఉత్తరం తీసి చదవ నుపక్రమించాను.

'మీవంశసాంప్రదాయ మెటువంటిదో నాకు తెలుసు మచ్చన్నది లేని మీవంశం


(11)

కళంక మవటం సహించలేక ఈ ఉత్తరం వ్రాయడానికి పూనుకున్నాను.

మీరు మీ అబ్బాయి వివాహం చేసెయ్యాలన్న సంకల్పంతో ఉన్నారు. ఈ వూర్లో శ్రీ. కే. రామారావుగారి పుత్రికా, శ్రీ కృష్ణమూర్తిగారి చెల్లెలూ అయిన పార్వతిని చూసుకుని వెళ్ళారు. అమ్మాయి రూపురేఖలు మిమ్మల్ని ఆకర్షించి ఉంటాయి. వాళ్ళుకూడా మీ సంబంధం కుదురుతుందన్న ఆశతోనే ఉన్నారు. అమ్మాయి రూపురేఖలు మిమ్మల్ని మోసపుచ్చి ఉంటాయి. దాన్లో మీ తప్పేమీ లేదు. మేడిపండు చూడ్డానికి ముచ్చటగానే ఉండచ్చు. అలాగే ఆ అమ్మాయి అందంలో రంభే కావచ్చు తిలోత్తమే కావచ్చు. ఐతే అందంకంటే స్త్రీకి ఉండాల్సినది శీలం. అసలు శీలం స్త్రీకి పెట్టని నగన్నారుకదండీ పెద్దలు ఆ అమ్మాయి, ఇక్కడ కాలేజీలో లెక్చెరరు ప్రకాశరావూ ప్రేమపక్షుల్లా విహరించడం అందరికీ తెల్సిన విషయమే. అంతెందుకు? పసరుపేటలో పార్వతీ ప్రియుడెవరని పసిపిల్లల్నడిగినా ప్రకాశరావని ఠక్కున చెబుతారు. మీ శ్రేయస్సును కోరేవాణ్ణి. మీ వంశ సాంప్రదాయమెటువంటిదో తెల్సున్నవాణ్ణి కాబట్టి వ్రాశాను. మీరు తగు జాగ్రత్తలో ఉంటారనే తలుస్తాను.

చిత్తగించవలెను
మీ శ్రేయోభిలాషి.

నిశ్చేష్టురాలి నయ్యాను. అన్నయ్య వల్ల పార్వతి కెలాంటిపేరు వచ్చిందీ? ప్రేమ ప్రేమంటూ దాన్ని నట్టేట్లో ముంచేశాడు. గంగా యమునా నదుల్లోని




స్వచ్ఛతా సరళతా పార్వతిలో ఉన్నాయని నాకయితే తెల్సునుగాని లోకానికేంతెలుసు? లోకులు పలుకాకులు. ఆ కాకుల నోళ్ళు కట్టడ మెవరితరం? ఉలిక్కిపడి పార్వతివైపు చూశాను. తల కిటికీ కమ్ములకానుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నది. దాని కోమల హృదయమెంతగా గాయపడిందో. దగ్గరకు వెళ్ళి దానితల నిమురుతూ నిల్చుండిపోయాను మాట్లాడ్డానికి మాటలు రాలేదు. మాటలు కూడదీసుకుంటూ అన్నయ్యే నన్ను అపార్థం చేసుకున్నాడు. మీ అన్నయ్య ఆ రకం....నన్నేంచెయ్యమంటావే రాధా అన్నది పార్వతి. నేనేం చెప్పగలను? అన్నయ్యకు వయస్సూ, చదువూ ఐతే ఉన్నాయిగాని బుద్ధిమాత్రం వికసించలేదు. పార్వతి అసలే అధైర్యస్థురాలు, పరిస్థితులను ఎదుర్కోలేక ఏనుయ్యో గొయ్యో చూసుకుంటుందేమోనన్న ఆలోచన రావడంతో నా వళ్ళు జలదరించింది పార్వతికి ధైర్యంచెప్పి వచ్చేశాను.

అన్నయ్యలో మార్పురావాలి. అది వస్తుందా? వచ్చిన పక్షంలో ఎలా వస్తుంది? వాడితో మాటలు పూర్తిగా తగ్గించాను. కాఫీ ఫలహారాలు ఇవ్వటం, భోజనం వడ్డించడం వగైరా పనులన్నీ మౌనంగానే జరిగిపోసాగినాయి. నాతో మాట్లాడ్డానికి వాడు కల్పించుకుని వచ్చినా నన్ను కాదట్లు తప్పించుకుని తిరగ సాగాను. "నువ్వుకూడా నా మీద కక్ష సాధ్దామనుకుంటున్నావటే అంటూ గొణుగుతాడు. వాడి స్వరం వింటూంటే నాకెక్కడలేని జాలీ పుట్టుకుని వస్తున్నది.

నాలుగైదు రోజులు గడచిపోయినాయి. ఒకరోజు ఉదయం భోజనాలయ్యాక అమ్మా, నేనూ 'షాపింగు' చేద్దామని బజారుకు బయలుదేరాము మేము ఇంటికి తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నము రెండు గంటలయ్యింది. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ హాల్లో పచార్లు చేస్తున్నాడు అన్నయ్య. వాడి ముఖం అంతగంభీరంగా ఉండడం నేనెన్నడూ చూడలేదు. నేను లోపలికివెళ్లి కాఫీకలిపి వాడికోసం తెచ్చేసరికి ఎక్కడికో వెళ్ళిపోయాడు.

రాత్రిపదిగంటలైనా అన్నయ్య యిల్లు చేరలేదు వాడు వచ్చాక భోజనం వడ్డించమని నాతోచెప్పి అమ్మపడుకుంది. ఏదో నవల చదువుతూ హాల్లో కూర్చున్నాను. పదకొండు గంటలు దాటాక అన్నయ్య వచ్చాడు. వాడి ముఖం ఎంతో ప్రశాంతంగా ఉన్నది. 'వడ్డించు వస్తున్నా' అంటూ మేడమీదకు వెళ్లిపోయాడు నేను భోజనాల గదిలోకి వెళ్ళి పీటవాల్చి, కంచమూ మంచినీళ్లూ పెట్టేసరికి వాడు వచ్చి కూర్చున్నాడు. మౌనంగానే భోజనమయ్యిందనిపించాడు.

చేతులు కడుక్కుని 'రాధా పైకిరావే. నీతో మాట్లాడాలి అంటూ మేడమీదకు వెళ్ళిపోయాడు. వాడు నాతో మాట్లాడవల్సిన విషయా లేమున్నాయి? భోజనాల గదిలో పని ముగించుకుని యాంత్రికంగా వాడి గదిలోకి వెళ్ళాను. నన్ను చూస్తూనే అలా కూర్చో రాధా.... నేను చెప్పే విషయం నీకు సంతోషాన్ని కలుగజేస్తుంది అన్నాడు మౌనంగా కుర్చీలో కూర్చున్నాను.

పార్వతి వదిన కావాలని నువ్వుకోరుకుంటున్నావుకదూ?

నేనుకోరుకున్నంతమాత్రాన పార్వతి వదినవుతుందా? అన్నయ్యలాంటి వాడ్ని ప్రేమించడం దాని ఖర్మ.

"పార్వతి నీకు వదినవుతుంది రాధా ఈ యింట్లో పార్వతికి స్థానం లేకపోవచ్చు. తనకు స్థానంలేని యింట్లో నాకూ అక్కర్లేదు. తన హృదయంలో ఏనాడో స్థానమిచ్చాను. ఇప్పుడు నా యింట్లోనే స్థానం ఇవ్వడానికి నిశ్చయించుకున్నాను. అనుమానంగా వాడివైపు చూశాను.

"పార్వతిని పెళ్ళి చేసుకోవాలన్న నిశ్చయానికి వచ్చాను రాధా."

విస్మయంతో వాడివైపు చూశాను, కలగంటున్నానేమోనన్న భ్రాంతి కలుగకపోలేదు.

"నువ్వు నమ్మలేకపోవచ్చు రాధా. నాన్నగారు అంగీకరించని పక్షంలో రిజిస్ట్రారువారి ఆఫీసు ఉండనేఉంది. ఇవాళ పార్వతితోనూ, కృష్ణతోనూ ఈ విషయమే మాట్లాడాను. మాటవరుసకు వాళ్ల

చిన్నాన్నగారిని వెంటబెట్టుకుని నాన్నగారితో మాట్లాడ్డానికి కృష్ణవస్తాడు

సంభ్రమాశ్చర్యాలతో మునిగి తేలాను. ఇంతకాలమూ అన్నయ్యాలో ఈ ధైర్య సాహసాలు ఎక్కడ మరుగున పడి వట్లు? ఈనాడు వాడిలాంటి మంచి నిర్ణయానికి రావడానికి కారణ మేమిటి? నాకు కలిగిన సంతోషం వర్ణనాతీతం. చాలా సేపటివరకూ అన్నయ్యను ఎలా అభినందించాలో అర్థంకాలేదు. చివరకు తేరుకుని.

"నన్ను క్షమించరా అన్నయ్యా నిన్ను అపార్థం చేసుకున్నాను అన్నాను. ఇన్నటివరకూ నన్ను సరిగానే అర్థం చేసుకున్నావు. ఇన్నటివరకూ నాన్నగారికి ఎదురుచెప్పగల ధైర్యం లేకపోవచ్చు. ఇవాళ జ్ఞానోదయ మయ్యింది. ఒకతెర తొలగిపోయింది. కాకపోతే నా జీవితాన్ని నాశనం చేసుకోవడమేకాక, పార్వతికి ఎన్నటికీ తీరని వ్యధను కలిగించినవాడ్నవుదును. అన్నయ్యామాటలు సరిగా అర్థంకాలేదు.

చాలా సంతోషంగా ఉంది రా అన్నయ్యా అంటూ నా గదిలోకి వచ్చేశాను.

పక్కమీద మేను వాల్చా. నన్నుమాత్రం గాని కళ్ళు మూతలు పడంలేదు ఎంతెంత ఆలోచనలు నా మదిలో మెదల సాగినాయి ఎన్నాళ్ళుగా అన్నయ్యాలో ఎలాంటి మార్పు రావాలని ఆశించానో ఆ చింత కాలానికి వచ్చింది. అయితే అది హఠాత్తుగా రావడంతో తట్టుకోలేక సంతోషంతో ఉక్కిరిబిక్కిరయినాను ఇంట్లో రాబోయే గాలివానకు అది హేతువవుతుంది. అన్నయ్యా మాట తప్పడు. పార్వతి వదినవుతుంది. అలాంటప్పుడు యింట్లో ఎలాంటి గాలివాన వచ్చినా ఫర్వాలేదు. ఇకముందు పార్వతిని వదినా అంటూ పిలవాలి. నామనో నేత్రం ముందు అన్నయ్యా వీరుడిగా, ధీరుడిగా, దయాళువుగా శాంతమూర్తిగా అనుకూలుడుగా పార్వతి ముగ్ధ సౌందర్య మూర్తిగా అనుకూలవతిగా మెదల సాగారు.

ఆ మరునాడు మామయ్య దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. తాంబూలాలు పుచ్చుకోడానికి ఫలానా రోజు మంచిదనీ, తనూ అత్తయ్యా వస్తున్నామనీ వ్రాశాడు. నాన్నగారు బ్రహ్మానంద భరితులై అమ్మను కేకేసి ఆ విషయం చెప్పారు. అల్లాంటి సమయాన ఎక్కడనుండి వచ్చాడో అన్నయ్యా వచ్చాడు. అమ్మా, నాన్నగార్ల హడావుడి గమనించి, ముఖములో చిరునవ్వు తెచ్చిపెట్టుకుని అన్నాడు.

"ఏదో హడావుడిగా ఉన్నారే."

"అవున్రా మీమామయ్యా అత్తయ్యా తాంబూలాలు పుచ్చుకోడానికొస్తున్నారు. అన్నయ్యావైపు అభిమాన వాత్సల్యాలతో చూస్తూ అన్నారు నాన్నగారు. అన్నయ్య ఏమీ తెలియనట్లు ముఖం పెట్టాడు.

"రాజ్యానికి ఈవూళ్లో సంబంధ మేదైనా కుదిరిందా?"

నాన్నగారు తెల్లబోయారు. అయన తేరుకునేంతలో అమ్మ అన్నది.

"అదేవిట్రా ఏం తెలియనట్లు మాట్లాడతావ్ మామయ్యాకు మరో సంబంధం చూడాల్సిన ఖర్మేం పట్టింది? మనం అనుకున్నదే కద"

"అంతే"

"రాజ్యం ఈ యింటి కోడలవుంది"

అన్నయ్య ముఖం చిట్లించాడు.

'నేనెప్పుడూ రాజ్యాన్ని చేసుకుంటా వనలేదే. మీరూ, ఆయనా అనుకుంటే నేనేం చెయ్యగలను? రాజ్యాన్ని చేసుకో. డానికి నేనిష్టపడ్డం లేదని ఇవాళే ఆ మామయ్యకు వ్రాసెయ్యండి. ఈ పెళ్లి కలలో కూడా జరుగదు. అమ్మా, నాన్న గార్ల సమాధానంకోసం వేచియుండక సుడిగాలిలా బయటకు వెళ్లిపోయాడు అన్నయ్య. నాకు చాలా సంతోషమైంది. అన్నయ్యను తలచుకుని ఎంతగానో గర్వించాను నాన్నగారి సమక్షంలో వాడలా మాట్లాడగలడని కలలో కూడా ఊహించలేనేమో? నాన్నగారు తెప్పరిల్లు కుని అన్నారు

'ఏవే శేషూ వాడు లాగొచ్చా దేమిటే?'

'ఏమో?' అన్నది అమ్మ శూన్యం లోకి దృష్టిని సారిస్తూ.

ఆరోజు రాత్రి నాన్నగార్కి ఎదురు చెప్పవద్దని కళ్లనీళ్ళు పెట్టుకుని అన్న య్యను ఎంతగానో బ్రతిమిలాడింది అమ్మ. అన్నయ్య మనస్సు మారలేదు.

'రాజ్యానికి లోటేమిట్రా?' అన్నది కళ్లు వత్తుకుంటూ.

'పార్వతిలో లోటేమిటని నే నడిగితే నువ్వేం చెబుతావ్ అమ్మా' అంటూ విసు రుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు అన్నయ్య.

*వాడు వెళ్ళినవైపే* చూస్తూ పార్వతీ అని గొణుక్కుంటూ నేలపై చతికిల బడింది అమ్మ.

ఆ మరువాడు ఉదయం నాలుగ్గంటల కల్లా నిద్రలేచి అన్నయ్య షికారుకు వెళ్లి పోయాడు. తొమ్మిదిగంటలవేళ చిన్నాన్న గారైన సీతాపతిగారిని వెంటబెట్టుకుని మా యింటికివచ్చారు. కృష్ణమూర్తిగారు సీతాపతిగారూ నాన్నగారూ క్లబ్బుస్నేహి తులు నాన్నగారు వాళ్లిద్దరినీ సాదారంగా ఆహ్వానించారు. కొంతసేపు క్లబ్బు విష యాలమీద రాజకీయాలమీదా కబుర్లు సాగినాయి.

"మా పార్వతి పెళ్లి ఈ వేసవిలో చేసేయ్యాలని ఉంద డీ" అంటూ అసలు విషయానికి నాందీ వాక్యం పలికారు కృష్ణమూర్తిగారు.

"సంతోషమోయ్. సంబంధం కుది రిందా?" అన్నారు నాన్నగారు ఉత్సా హంతో "అందుకే వచ్చామండీ. మీ అబ్బాయికివ్వాలని ఉంది" అన్నారు సీతా పతిగారు నాన్నగారి ఉత్సాహం చప్పున చల్లబడింది. మెల్లిగా గొణిగారు;

"మా వాడికి మేనరికం ఉంది."

"మీకు బావమరుదులున్నారని తెలి యదే" సీతాపతిగారు ఆశ్చర్యపోతూ అన్నారు

"మా ఆవిడకు వేలువిడచిన తమ్ముడు ఆయనకు కూతురుంది."

"ప్రసాదరావుగారూ.... మనం పెద్ద వాళ్ళమయిపోయాం. మన కాలంనాటి పిల్లలు కాదు వాళ్ళు .... ఒకరి నొకరు ప్రేమించుకున్నారట. పెళ్లి చేసుకుందా మన్న నిశ్చయానికి వచ్చేశారట.... పెద్ద వాళ్ళు ఒప్పుకోని పక్షంలో 'రిజిస్టరు మ్యారేజి చేసుకుంటారట. మనమేం చెయ్యగలం? వాళ్ళిద్దరూ మైనర్లు కాదు.

చట్టానికి విరుద్ధంగా వాళ్ల వివాహానికి అడ్డు నిలవగలమా? వాళ్లలా చేస్తే చిన్నతనం ఎవరికి? వాళ్లకా? మనకా? పలుగురూ ఏమనుకుంటారు? మన పెద్దతనం మనం నిలబెట్టుకోవడమే ఉత్తమమైన మార్గమనిపిస్తోంది ఆలోచించండి."

నాన్నగారు ఏమని ఆలోచించగలరు? సీతాపతిగారే తిరిగి చెప్పడం మొదలు పెట్టారు.

"పార్వతికి పసుపు కుంకుమల క్రింద రెండెకరాల పొలం ఇవ్వాలని నిశ్చయించుకున్నారు. పెళ్ళి ఘనంగా చేయించి కట్నం కానుకలు ఉన్నంతలో ముట్టచెప్పించే పూచీ నాది."

"ఆలోచించనివ్వండి" నాన్నగారు మెల్లిగా అన్నారు.

వాళ్లిద్దరూ వెళ్లిపోయారు. నాన్నగారుమాత్రం ఆలోచిస్తూ చాలాసేపు కుర్చీలో కూర్చుండిపోయారు.

ఆరాత్రి అన్నయ్యా, నాన్నగార్లమధ్య చాలాసేపు ఘర్షణ జరిగింది. ఒకమూల బొమ్మలా నిలబడింది అమ్మ. నేనొక మూల కుర్చీలో కూర్చున్నాను పుస్తకం చదువుతున్నట్లు నటిస్తూ. ఇద్దరూ పట్టుదలతో ఉన్నవాళ్ళే చివరకు ఒకరు తగ్గడం తథ్యం! అయితే అన్నయ్య తగ్గడంమాత్రం నేను సహించలేను ఓవరకు జరిగినదికూడా అదే; ఆస్తి వదులుకోగలను కాని పార్వతిని వదులుకోలేనన్నాడు నాన్నగారు ఒప్పుకోని పక్షంలో రిజిస్ట్రారువారి ఆఫీసు ఉండనే ఉన్నదన్నాడు అన్నయ్యా. వాడు తన ఎదట అలా మాట్లాడతాడని నాన్నగారు ఊహించి ఉండరు. అన్నయ్య తన గదిలోకి వెళ్లిపోయాడు.

ఒకటి రెండు రోజులు బయటి వాతావరణం ప్రశాంతంగానే ఉన్నా మా యింట్లో మటుకు ఎదురు మదురుగా వర్షాలు పడుతూనే ఉన్నాయి, పెను గాలులు వీస్తూనే ఉన్నాయి. క్రమక్రమంగా మా యింట్లో ప్రశాంతత అలముకున్నది నాన్నగారు అమ్మ సలహా అడిగారు.

"నువ్వేమంటావ్ శేషూ....వాడిష్ట ప్రకారమే కానిద్దామా?...."

"పార్వతికేమండి లక్ష్మిలాంటి పిల్ల వాళ్లూ మర్యాదస్థులు. అసలు రాజ్యాన్ని చేసుకోవడం నా కిష్టంలేదు .... కాకి ముక్కుకి దొండపండులా .... మనవాడు దొరబాబులా ఉంటాడు. అంది పార్వతి వాడికి అన్నివిధాలా తగినది. ఇంతకాలం మీరేమైనా అంటారేమోనన్న భయంతో, చెప్పలేకపోయాను...." అన్నది అమ్మ.

అమ్మకు అంత ధైర్యం ఎక్కడ నుండి వచ్చిందో నాకు తెలియదు! అమ్మ అలా అనడంతో నాన్నగారు మౌనంగా ఉండిపోయారు. మౌనం అంగీకార సూచకమని పెద్దవాళ్లు చెప్పనే చెప్పారు కదా! అమ్మ ఎంతగానో సంతోషించింది. పార్వతి కోడలై యింట్లో లక్ష్మీదేవిలా చకచకా తిరుగుతూవుంటే అంతకన్న తనకు మాత్రం ఏం కావాలి? ఆ రోజే మామయ్య పేరిట ఉత్తరం పోస్టు డబ్బాలో పడింది!

సంబంధం నిశ్చయమయ్యిందని తెలియడంతో వెంటనే నెలరోజులు సెలవు పెట్టి పార్వతి చిన్నన్నయ్యా శ్రీహరి రావుగారు ఏలూరు చేరుకున్నారు. పెళ్లి

నాలుగురోజు లుందనగానే మా యిల్లూ, వాళ్ళ యిల్లూ బంధుమిత్రుల సపరివారంతో కళకళ్లాడినాయి. మా బంధువర్గంలో పెళ్ళికిరానిదల్లా మామయ్య కుటుంబం మాత్రమే. మా క్లాసు అమ్మాయిలూ, అబ్బాయిలూ నూటికి నూరుపాళ్ళు హజరై పెళ్ళిలో విశ్రాంతిని మరచి సహాయం చేశారు.

ఆకాశమంత పందిరి వేశారని, ఘనంగా కట్నాలూ కానుకలూ చదివించారనీ చెప్పను కాని, శక్తికొలదీ కట్నాలూ, కానుకలూ చదివించారని, పెళ్ళిలో ఏ విషయంలోనూ లోభత్వం చూపలేదని చెప్పక తప్పదు. వాళ్ళు చూపిన ఆదరాభిమానాలు చిరస్మరణీయమైనవి! పెళ్ళయినాక నాన్నగారు మా యింట్లో విందు ఏర్పాటు చేశారు. మా క్లాసు అబ్బాయిలూ, అమ్మాయిలూ హాజరైనారు. ఒక పదిమంది అబ్బాయిలు అన్నయ్యా, వదినా కూర్చున్నవైపుకి వెళ్ళారు; ఏకకంఠంతో.

"మీరిద్దరూ మమ్మల్నందరనీ క్షమించాలి" అన్నారు.

అన్నయ్యా, వదినా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"ఆ వెంకట్రామయ్యగారికి చేరిన శ్రేయోభిలాషి ఉత్తరం శ్రీపతివ్రాశాడు. ఐతే అందులో అందరికీ సమభాగం ఉంది. అది కేవలం పార్వతిగారికి మరొకరితో పెళ్ళయిపోతుందేమోనన్న భయంతో వ్రాశాము. అంతకుతప్ప వేరే ఆలోచనలతో కాదు .. మేము కోరుకున్నది మీరిద్దరూ కలవాలనే."

అన్నయ్య మందస్మితవదనంతో సున్నితంగా మందలించాడు.

"జరిగినదేదో జరిగిపోయింది. ఇక ముందు అల్లాంటిపనికి పూనుకోకండి. పార్వతి ధైర్యస్థురాలు కాబట్టి సరిపోయింది.

వదిన అడుగుపెట్టటంతో మా యింటికి కొత్త వెలుగూ, కళావచ్చినాయి. వదిన యింట్లో తిరుగుతూవుంటే లక్ష్మీదేవి తిరుగుతున్నట్లే అన్పిస్తున్నది. ఎందుకు అన్పించదూ మరి మా వదిన ఎంత అందమయినదనీ సన్నని పొడవైన విగ్రహం పసిమి ఛాయ పద్మాన్ని బోలిన ముఖము కొలనాగును జ్ఞప్తికితెచ్చే తలకట్టు విశాలమైన కాటుకకళ్ళు తిలపుష్పాన్నిబోలిన నాసిక మల్లెమొగ్గల గుచ్ఛంలాంటి పలువరుస ఒక్కొక్కసారి నాకే 'జెలసీ'పుట్టుకు వస్తున్నది. అతి బుద్ధిమంతుడైన అన్నయ్య ప్రేమలో పడ్డాడంటే పడదూ మరి? ఇంట్లో అడుగుపెట్టిన కొద్ది రోజులకే అమ్మకూ, నాన్నగారికీ తలలో నాలుకైపోయింది. అందుకు కారణం తన మంచి తనమే.

ఒకరోజు ఉదయం మా 'రిజల్ట్సు' వస్తాయని తెలియడంతో పేపరు తెస్తానంటూ అన్నయ్య స్టేషనుకు పరిగెత్తాడు. వదిన తనకేమీ పట్టనట్లు తన పనులు చూసుకోసాగింది. తను ప్రేమ పరీక్షలోనే నెగ్గింది! అల్లాంటప్పుడు ఈ పరీక్ష ఏపాటిది, నాకు మాత్రం మనసు మనస్సులోలేదు. అన్నయ్యకోసం ఆతృతతో ఎదురు చూస్తూ హాల్లో కూర్చున్నాను.
'పార్వతీ... పార్వతీ' అంటూ వచ్చాడు.
అన్నయ్య వదిన హాల్లోకి వచ్చింది.
'కంగ్రాట్యులేషన్స్ పార్వతీ......

ఫస్టు క్లాసులో ప్యాసయ్యావ్ అసలు నాకు ముందరే తెలుసనుకో. ఈ శుభసమయాన నీకేం కావాలో కోరుకో వదిన అందంగా నవ్వుతూ నిలబడింది. నాకు వళ్ళు మండుతున్నది.

'నా పరీక్షేమయ్యిందిరా అన్నయ్యా' అన్నాను చిరాగ్గా.

'నీ నెంబరు చూడనేలేదే ఎంతన్నావ్ నెంబరు' అంటూ పేపరు చూసి నువ్వుకూడా ఫస్టుక్లాసులో ప్యాసయ్యావే అన్నాడు.

'రాధా నీ కోరిక లేవిటో చెప్పు.... అవి తీరేటట్లు చూడడం నా పూచీ అన్నది వదిన.

అన్నయ్యను కవ్వించడానికి వదిన అప్పుడప్పుడు అంటూ ఉంటుంది. ప్రేమిస్తే ప్రేమించావుగాని మా ఆయన లాంటివాళ్ళను ప్రేమించేవ్. అష్టకష్టాలూ పడాలని. అన్నయ్య నవ్వేస్తాడు. అలాంటి భయం దానికక్కర్లేదు పార్వతీ పలహారిచ్చేందుకు నీలాంటివదిన ఉండనే ఉంది అంటాడు.

ఒకరోజు ఉదయం కాలేజీలో పని ఉందంటూ వెళ్ళిపోయాడు అన్నయ్య. ఆ సమయంలో వదిన ఒక మహాకార్య నిర్వాహణకు కంకణం కట్టుకుని నా సహాయాన్ని అర్థించింది. ఆ మహాకార్యం మరేమీకాదు-మహారణ్యంలా ఉన్న అన్నయ్య గదిని ఒక కొలిక్కి తేవడం! మేమిద్దరమూ అన్నయ్య గదిలోకి వెళ్లాము. వదిన బట్టల బీరువా సర్దసాగింది. నేను గది నలుమూలలా వెదజల్లబడ్డ పుస్తకాలను చేతబట్టుకుని పుస్తకాల బీరువా తలుపు తెరిచాను. ఎంత కాలంనుండి తిండిలేక మలమలమాడుతూ కారాగృహవాసాన్ని అనుభవిస్తున్నదో ఒక బక్క చిక్కిన మూషికం బయటకు దుమికింది. ఫక్కున నవ్వి బీరువాలో ఉన్న చెత్తా చెదారమూ బయటకు లాగాను! వాటితోపాటు ఒక 'ప్యాకెట్టు' కూడా వచ్చింది. అది చేతబట్టుకుని చూశాను. పోస్టులో వచ్చిన పార్సెలు అది. దానిపై దస్తూరీ చిరకాలంగా పరిచయమైనదే. అది మరెవరో కాదు! మావదినది. కుతూహలాన్ని అణచుకోలేక పై కాగితాలు ఊడదీయగా ఒక అట్టపెట్టె దర్శనమిచ్చింది. అట్టపెట్టె తెరవగా ప్రప్రథమంగా నాకళ్ళబడ్డది ఒక మడచిన కాగితం. దానిక్రింద పసుపురంగు రిబ్బనుతో కట్టివున్న చిన్న

టెలిఫోన్లు: ఎడిటర్: 7030, మేనేజర్: 4843.

మీ వ్యాపారాభివృద్ధికి జయశ్రీ ఉత్తమ సాధనం

నేడే మీ ప్రకటన పంపండి

ప్రకటన రేట్లు

ఓపెనింగ్ పేజీ 125–00 1 పేజీ 100–00 1/2 పేజీ 60–00

ఇతర వివరాలకు: అడ్వర్‌టైజమెంటు మేనేజర్

జయశ్రీ

సచిత్ర మాసపత్రిక విజయవాడ–2.

'ప్యాకెట్టు' కాగితం మడతవిప్పి చూశాను. అచ్చును మరపించేంత అందంగా ఆకర్షణీయంగా ఉన్న అక్షరాలు – ఒకే ఒక పంక్తి—

'మీ ధైర్యసాహసాలకు నా కానుక – పార్వతి'

ఆ కానుక ఏమిటో నాకు కుతూహలంతో ప్యాకెట్టు విప్పాను. ఘల్లుమన్న శబ్దం వినవచ్చింది. నాకు మూర్ఛ వచ్చినంతపనయ్యింది. అన్నయ్యను రెచ్చగొట్టి, కవ్వించి తనవాణ్ని చేసుకున్నది పార్వతి. అది అమాయకురాలని అధైర్యస్థురాలనీ అనుకునేదాన్ని కాని అసాధ్యురాలు!

ప్రేమికులు ప్రేమబాటలో కొంత దూరం నడవగా ఒక మహాప్రవాహం అడ్డువస్తుంది. అది సమస్యల ప్రవాహం. ఒకరినొకరు వారిద్దరూ ఎంత గాఢంగా ప్రేమించుకున్నా ధైర్యసాహసాలూ, చొర్వఉంటేనే ఆప్రవాహాన్ని దాటగలరు ప్రియుడు పిరికివాడైతే ప్రవాహంలో కొట్టుకుపోతాడు. ఆ ప్రియురాలు–అలిబిలికూడా అధైర్యస్థురాలైతే అతడు వస్తాడని. తనను రక్షిస్తాడని ఎదురు చూస్తుంది అతడు వచ్చేదేమిటి? ఫలితం ఆమె సుడిగుండాల్లో చిక్కుకుని మునకలువేస్తుంది. అయితే ఆమె వదినలా తెలివైనదీ, ధైర్యస్థురాలూ అయిన పక్షంలో అతడిని ఆ ప్రవాహంనుండి రక్షించి అవతలి గట్టుకు చేర్చగలదు. అవతలిగట్టు చేరుకున్నాక వారిరువురికీ ఒక రాజబాట దర్శన మిస్తుంది. అది సంసారపు బాట. ఆ బాటలో అడుగు పెట్టాక వారిరువురూ క్షణక్షణానికీ దగ్గరవుతారు. అనుబంధాలు ఒకరినొకరిలో ఐక్యం చేసేస్తాయి. ప్రేమలో పరమార్థం గోచరిస్తుంది. తేరుకుని ప్రక్కకు తిరిగి చూద్దునుకదా నా ప్రక్క వదినా, అన్నయ్యా నిలబడిఉన్నారు. అన్నయ్య నవ్వుతున్నాడు వదిన ముఖం దించుకున్నది చేతికి గాజులిచ్చాను. ముఖమెత్తి నావైపు చూసింది. వదిన కళ్ళు వర్షించడానికి సిద్ధంగా ఉన్నాయి. అలాంటి సమయంలో వాళ్ళిద్దరినీ ఏకాంతంగా వదిలేస్తే మంచిదనిపించి బయటకు నడిచాను.

"నా పార్వతీ ఏడుస్తున్నావా డోంట్ బి సిల్లీ. నీ కళ్ళల్లో నీళ్ళు నేను సహించగలనా? అవి పంపినందుకు నాకు కోపం వచ్చినమాట నిజమే. అయితే ఆ కోపమే మనిద్దర్ని రక్షించింది. కాకపోతే నువ్వూ నేనూ జీవితాంతమూ సుఖానికి సంతోషానికీ దూరమవుదుము."

అన్నయ్య మాటలు నా చెవిని పడక పోలేదు.

ఆతర్వాత?

అన్నయ్య వదినకన్నీరు తుడుస్తాడు. ముంగురులను సవరిస్తాడు.

ఆ తర్వాత??

'నవ్వాలి పార్వతీ.... ఒక్కసారి.... ప్లీజ్....' అంటూ వదినను వేడుకుంటాడు అన్నయ్య.

వదిన నవ్వుతుంది.

ఆనవ్వు పువ్వులవర్షమంత అందంగా కన్పిస్తుంది అన్నయ్యకు.

ఆ తర్వాత???

★